

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 30 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 52 పేజీలు : 4 వెల : రూ 3-00







## మంత్రి పేర్ని నానితో ముగిసిన సినీ నిర్మాతల భేటీ



మచిలీపట్నం: సినీ పరిశ్రమ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవ చూపుతోందని మంత్రి పేర్ని నాని తెలిపారు. మచిలీపట్నంలో బుధవారం తెలుగు సినీ నిర్మాతలతో సమావేశం ముగిసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాతూ.. ఆన్‌లైన్ టికెటింగ్ కొత్తగా ప్రభుత్వం పెట్టింది కాదని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమ ఆన్‌లైన్ టికెటింగ్‌కు అనుకూలంగా ఉందని తెలిపారు. సినిమా టికెట్లపై నిర్దిష్ట విధానం అవసరమని గుర్తుచేశారు. ఇప్పటికే ఆన్‌లైన్ టికెటింగ్ విధానం కొనసాగుతోందని, ఇది కొత్తగా ప్రభుత్వం పెట్టింది కాదని మంత్రి చెప్పారు. పరిశ్రమలో జరుగుతున్న పరిణామాలపై చర్చించేందుకు నిర్మాతలు వచ్చారని మంత్రి నాని తెలిపారు. పరిశ్రమ అంతా ఐకమత్యంతోనే ఉందని పేర్కొన్నారు. టికెట్ ధర తక్కువగా ఉంటే ఇబ్బందుల్లో పడతామని, నిర్మాణ వ్యయం కూడా పెరిగిందని నిర్మాతలు చెప్పినట్లు వివరించారు. దీనిపై ప్రభుత్వం చొరవ చూపాల్సిందిగా కోరినట్లు మంత్రి చెప్పారు. కరోనాతో సినీ పరిశ్రమ తీవ్రంగా నష్టపోయిందని, ఇప్పటివరకు థియేటర్‌లో ఉన్న 50 శాతం ఆక్యుపెన్సీని వంద శాతం పెంచాల్సిందిగా కోరారని వెల్లడించారు. వారి విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తారనుకుంటున్న సమయంలో ఒక సినీ నటుడి వల్ల దురదృష్టకర పరిణామాలు తలెత్తాయని వివరించారు. పవన్ అభిప్రాయలకు తాము అనుకూలంగా లేమని, పవన్ వ్యాఖ్యలకు తమకు సంబంధం లేదని నిర్మాతలు స్పష్టం చేసినట్లు మంత్రి నాని వివరణ ఇచ్చారు. అలాగే చిరంజీవి కూడా తనతో మాట్లాడరని, ఆడియో ఫంక్షన్‌లో జరిగిన పరిణామాలతో పరిశ్రమకు సంబంధం లేదని చెప్పినట్లు తెలిపారు. పరిశ్రమను బతికించేందుకు ప్రభుత్వం ఇచ్చే సూచనలు, సలహాలు పాటించేందుకు తాము సిద్దమని నిర్మాతలు చెప్పారని మంత్రి చెప్పారు. మంత్రితో జరిగిన సమావేశంలో నిర్మాతలు దిల్ రాజు, బన్నీ వాసు, సునీల్ నారంగ్, వంశీ రెడ్డి, మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ధిక్కరించేవారిని శిక్షించే అధికారం తొలగింపు అసాధ్యం : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : తమ ఆదేశాలను ధిక్కరించేవారిని శిక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉందని, చట్టం చేయడం ద్వారా అయినా ఈ అధికారాన్ని తొలగించడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు తెలిపింది. అత్యున్నత న్యాయస్థానం అధికార పరిధిని పదే పదే దుర్వినియోగపరుస్తున్న ఓ ఎన్‌జీవో చైర్‌పర్సన్ కోర్టు ధిక్కార చర్యలపై విచారణ సందర్భంగా బుధవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సూరజ్ ఇండియా ట్రస్ట్ చైర్మన్ రాజీవ్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. రాజీవ్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని, కోర్టుకు అపకీర్తి తేవడానికి ఆయన చేసే చర్యలు సహించరానివని పేర్కొంది. రాజీవ్ అనేక సంవత్సరాలుగా, పదే పదే అల్పమైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేస్తూ కోర్టు అధికార పరిధిని దుర్వినియోగపరుస్తున్నారని సుప్రీంకోర్టు అంతకుముందు పేర్కొంది. ఆయనకు రూ. 25 లక్షలు జరిమానా విధించింది. ఈ సొమ్మును ఆయన జమ చేయకపోవడంతో కోర్టు ధిక్కార చర్యలు చేపట్టింది. తనకు విధించిన జరిమానాను చెల్లించేందుకు తన వద్ద సొమ్ము లేదని, తాను రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరుతానని రాజీవ్ కోర్టుకు తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు స్పందిస్తూ, జరిమానాలను రాబట్టే విషయంలో రాష్ట్రపతి సమక్షంలో క్షమాభిక్ష దరఖాస్తు చేయడానికి వీలు కల్పించే నిబంధన ఏదీ లేదని తెలిపింది. ఆయనకు విధించిన రూ. 25 లక్షల జరిమానాను భూమి రెవిన్యూ బాకీలను రాబట్టే పద్ధతిలో రాబట్టాలని ఆదేశించింది. రాజీవ్ తన దారిన తాను ప్రవర్తిస్తున్నారని, కోర్టు, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, రాష్ట్ర ప్రభుత్వాలపై బురద జల్లుతున్నారని పేర్కొంది. తాము వెనుకకు తగ్గేది లేదని, దీనిని ఓ తార్కిక ముగింపునకు తీసుకెళ్తామని తెలిపింది. ఆయన క్షమాపణ చెప్పడంలో నిజాయితీ లేదని తెలిపింది. కేవలం పర్యవసానాల నుంచి బయటపడటానికి మాత్రమే ఆయన ప్రయత్నిస్తున్నారని పేర్కొంది. మరోవైపు మరికొన్ని ఆరోపణలు కూడా చేస్తున్నారని తెలిపింది. ఇదంతా ఓ ప్రహసనంగా ఉందని పేర్కొంది. ఆయన ఎటువంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయడం లేదని వ్యాఖ్యానించింది. ఆయనకు మరొక అవకాశం ఇస్తూ, తదుపరి విచారణను అక్టోబరు 7కు వాయిదా వేసింది. రాజీవ్ అనేక సంవత్సరాలుగా ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేస్తున్నారు. మొత్తం మీద 64 పిల్స్ వేసినప్పటికీ, కనీసం ఒకదానిలోనైనా విజయం సాధించలేదు. పదే పదే తన అధికార పరిధిని దుర్వినియోగపరుస్తున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రూ. 25 లక్షలు జరిమానా విధిస్తూ 2017 మే 1న ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను ఉపసంహరించాలని రాజీవ్ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

## ఏపీలో కొత్తగా 1,084 కరోనా కేసులు




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఏపీలో 57,345 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 1,084 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గత 24 గంటలలో కరోనా బారిన పడి 13 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 14,163 కు చేరింది. గత 24 గంటల్లో 1,328 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19,89,391 మంది ఏపీలో డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బుధవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 11,655 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 20,49,314 కు చేరింది. ఏపీలో ఇప్పటి వరకు 2,81,78,305 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 20,23,496 మంది కరోనా నుంచి కోలుకున్నారు.

## తెలుగు అకాడమీలో నిధుల గోల్‌మాల్

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉన్న తెలుగు అకాడమీలో నిధులు గోల్‌మాల్ అయ్యాయి. కార్వన్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నకిలీ పత్రాలు సృష్టించిన కేటుగాళ్లు 43 కోట్లు కాజేశారు. వివారాల్లోకి వెళ్లితే.. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో తెలుగు అకాడమీ దశాబ్దాలుగా కార్యలపాలు నిర్వహిస్తుంది. ఉమ్మడి జాబితాలో ఉన్న తెలుగు అకాడమీ నిధులను ఆంధ్రప్రదేశ్‌కు పంచాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు తెలుగు అకాడమీలో ఉన్న రూ. 213 కోట్లలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వాటా 125 కోట్లు ఇవ్వడానికి అకాడమీ సిద్ధం అయ్యింది. భవనాలు, నగదు వివరాలను లెక్కిస్తుండగా.. వివిధ బ్యాంక్‌లతోపాటు యూబీఐ కార్వాన్, సంతోష్‌నగర్ ఖాఖల్లో రూ. 43 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని తేలింది. వీటిని గడువు తీరకముందే తీసుకోవాలని అకాడమీ అధికారులు నిర్ణయించారు. అయితే 43 కోట్ల రూపాయలు విత్‌డ్రా చేసేందకు ప్రయత్నించగా ఆసలు బ్యాంక్‌లో డబ్బులు లేవని తేలింది. సెప్టెంబరు 22న డబ్బులు కోసం తెలుగు అకాడమీ అధికారులు బ్యాంక్‌కు వెళ్లగా.. తర్వలో ఇస్తామని అధికారులు చెప్పారు. మళ్ళీ అడగ్గా ఆసలు నిధులు లేవని బ్యాంక్ మేనేజర్ మస్తాన్ అలీ పేర్కొన్నారు. దీంతో అకాడమీ డైరెక్టర్ సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మొత్తం లావాదేవిలో బ్యాంక్ మేనేజర్ పాత్రపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 43 కోట్లలో 23 కోట్లు వేరే బ్యాంక్‌కు బదిలీ అయినట్టు తెలుస్తోంది.




## 100 రోజుల పాటు 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమం: పెద్దిరెడ్డి



తాడేపల్లి: అక్టోబర్ 2న విజయవాడలో క్లాప్, 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వంద రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా క్లాప్, 'జగనన్న స్వచ్ఛసంకల్పం' కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆయన తాడేపల్లిలోని పీఆర్,ఆర్డీ కమిషనర్ కార్యాలయం నుంచి వైఎస్సాఆర్ ఆసరా, చేయూత, 'జగనన్న స్వచ్ఛ సంకల్పం'పై జిల్లా కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలన్నది సీఎం జగన్ ఆశయమని తెలిపారు. కరోనా వంటి సంక్షోభ సమయంలో ఆరోగ్యానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో పంచాయతీరాజ్ శాఖ నిర్వహించిన పచ్చదనం-పరిశుభ్రతా పక్షోత్సవాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని గుర్తుచేశారు. గ్రామాల్లో అహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాలకు అవసరమైన అన్ని వనరులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రజాభాగస్వామ్యంతోనే స్వచ్ఛ సంకల్పం విజయవంతం అవుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ 7న సీఎం వైఎస్ జగన్ 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అర్హత ఉన్న ఎస్‌హెచ్‌జీ మహిళల వ్యక్తిగత ఖాతాలకే ఆసరా సొమ్మును జమ చేస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ పదిరోజుల పాటు ఆసరా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఆసరా అమలులో నియోజకవర్గ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించాలనే లక్ష్యంతో సీఎం జగన్ పనిచేస్తున్నారని తెలిపారు. ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడాలని, అందుకు అవసరమైన సహకారంను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. మార్కెటింగ్, రుణాల లభ్యత విషయంలో జిల్లా కలెక్టర్లు ఎస్‌హెచ్‌జీ మహిళలకు మార్గదర్శనం చేయాలని అన్నారు.

## కోడికత్తి, కిరాయి మూకలకు భయపడే ప్రశ్నేలేదు: పవన్ కళ్యాణ్



మంగళగిరి: కోడికత్తి, కిరాయి మూకలకు భయపడే ప్రశ్నేలేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జనసేన విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ నేతలతో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడారు. వైకాపా గ్రామ సింహాల ఘోంకారాలు సహజం.. జనసైనికుల సింహ గర్జనలు సహజం అని వ్యాఖ్యానించారు. 'ఘోంకారం అంటే మొరుగుట.. గ్రామ సింహాలంటే కుక్కలు. గ్రామ సింహాలు అంటే పళ్లు రాలగొట్టించుకునే కుక్కలు' అని పవన్ వివరించారు. "భయం అంటే ఎలా ఉంటుందో నేను నేర్పిస్తా. కులాల చాటున దాక్కుంటే బయటకు లాక్కొచ్చి కొడతా. సొంత చిన్నాన్న హత్యకు గురైతే చంపిందెవరో చెప్పలేరా? కోడికత్తి కేసు ఏమైందని అడిగితే మీరు స్పందించిన తీరేంటి? నాకు బూతులు రాక కాదు, బాపట్లలో పుట్టినోడిని నాకు తిట్లు రావా? నేను నాలుగు భాషల్లో బూతులు తిట్టగలను. నాలుగు రోజులు సమయమిస్తే నేర్చుకుని మరీ.. ఏ భాషలో కావాలంటే ఆ భాషలో తిడతా. వైకాపా అధినేత కూడా నా వ్యక్తిగతం గురించి మాట్లాడారు. నా తల్లిదండ్రులు నాకు సంస్కారం నేర్పారు.. నేను వైకాపా వారిలా మాట్లాడట్లేదు. మా నాన్న నాకు ధైర్యం, తెగింపు, ధర్మరక్షణ లక్షణాలు ఇచ్చారు. వైకాపా నేతల ఇంట్లో ఆడవారిపై తప్పుగా మాట్లాడబోమని హామీ ఇస్తున్నా" అని అన్నారు. " వైకాపా నేతలకు ఏ పద్ధతిలో కావాలంటే అలా యుద్ధం చేస్తాం. 2014లో తెదేపా, భాజపాకు కూడా అభివృద్ధి కోసమే మద్దతిచ్చా. ఏపీ అభివృద్ధి గురించి మాత్రమే అడుగుతా. సాటి మనిషికి అన్యాయం జరిగితే స్పందించే గుణం నాలో ఉంది. ఇంట్లో వారి కారణంగా ఇష్టం లేకపోయినా సినిమాల్లోకి వచ్చా. రాజకీయాల్లో కలుపు మొక్కలను తీసేయగలను. నిజమైన ప్రెసిడెంట్ మెడల్ రావాలంటే యుద్ధాలు చేయాలి. ఏపీ ప్రభుత్వం నెలకు రూ. 5000 ఇస్తే ప్రెసిడెంట్ మెడల్ ఇస్తుంది. రూ. 5000కే ప్రెసిడెంట్ మెడల్, మద్యం అమ్ముతున్నారు. నిత్య దరిద్రుడు నిశ్చింత పురుషుడు అనే సామెత వైకాపా ప్రభుత్వం నిజం చేస్తుంది. నన్ను తిడితే ఏడుస్తానని వైకాపా నేతలు భ్రమపడుతున్నారు. నన్ను తిట్టేకొద్దీ నేను బలపడతాను తప్ప బలహీనపడను. నేను బలహీనపడక పోగా ఎవరినీ మరిచిపోయే ప్రశ్నే లేదు. నా అంతట నేను యుద్ధం చేయను, నన్ను లాగితే వదలను. అభివృద్ధి గురించి ఏపీలో మాట్లాడటానికేం లేదు. ఏపీలో రోడ్లు వేయటానికి కూడా ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవు. ప్రజలు నావారు అనుకోబట్టే ప్రతి సన్నాసితో తిట్టించుకుంటున్నాను. కోడికత్తి, కిరాయి మూకలకు భయపడే ప్రశ్నేలేదు" అని పవన్ కల్యాణ్ అన్నారు. "నేను సినిమా టికెట్ల గురించి మాత్రమే మాట్లాడా.. నాకేమీ సినిమా థియేటర్లు లేవు. మీ వైకాపా నేతలకే థియేటర్లు ఉన్నాయి. నా మొదటి సినిమాకు మా బావ అరవింద్ రూ. 5వేలు ఇచ్చారు. జానీ సినిమాకు తీసుకున్న డబ్బు మొత్తం వెనక్కి ఇచ్చేశా. మా కష్టార్జితంపై ప్రభుత్వం పెత్తనం ఏమిటని మాత్రమే అడిగాను. అడిగిన దానికి సమాధానం చెప్పకుండా కాట్ల కుక్కల్లా అరుస్తున్నారు. వైకాపా వాళ్ల సొంత డబ్బు ఎప్పుడైనా ఎవరికైనా ఇచ్చారా? సైనిక సంక్షేమ బోర్డుకు రూపాయైనా ఇచ్చారా? రూ. లక్ష కోట్లు సంపాదించినా ఎంగిలి చేత్తో కాకిని కూడా విదల్చరు. ప్రజలు ప్రతి పనికి ప్రభుత్వానికి పన్ను కడుతున్నారు. భారతీ సిమెంట్‌ను అందరికీ ఉచితంగా పంచవచ్చు. అడిగిన దానికి సమాధానం చెప్పని వైకాపా వాళ్లకు సిగ్గుండాలి. వైకాపా నేతలు బెదిరిస్తే భయపడటానికి ఇడుపులపాయ ఎస్టేట్ కాదు. జగన్ ప్రమాణ స్వీకారానికి రమ్మని ఆహ్వానించిన రోజే ఓ మాట చెప్పా.

## 'పవన్ సాగిస్తున్న దాడులు ఎంతో కాలం సాగవు'



విజయవాడ: మహిళల ఆత్మగౌరవాన్ని దిగజార్చిన హీనుడు చంద్రబాబు అంటూ తెలుగు? సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి ఫైర్ అయ్యారు. పోసాని మురళి భార్యకు జరిగిన అవమానం చూశాక మాట్లాడకుండా ఉండటం మానవత్వం కాదు. నీచ నికృష్ట రాజకీయ చదరంగం ప్రారంభించి, చివరకు సంస్కార హీనుల్ని తయారుచేసి మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే స్థాయికి తెలుగుదేశాన్ని దిగజార్చిన హీనుడు చంద్రబాబు. బాబులాగే ఇటువంటి హీనరాజకీయాలకు వారసత్వంగా మహిళల వ్యక్తిత్వాలను కించపరుస్తూ లోకేష్, పవన్ కల్యాణ్ సాగిస్తున్న దాడులు ఎంతో కాలం సాగవు. మీ ఇంటి స్త్రీలను అవమానపరిచిన అదే టీడీపీతో కలిసి పనిచేస్తూ విలువలకు తిలోదకాలు ఇచ్చారు. ఈ అరాచకాలు సహించలేనివి. ఎంతో ఉత్తమురాలు, ఏనాడు బయటకు రాని పోసాని భార్యను మీరు అవమానించడం అంటే మీరు ఏ స్థితికి దిగజారిపోయారో ఆలోచించుకోండి. ముగింపు తొందరలోనే ఉంది. భగవంతుడే మీకు బుద్ధి చెప్తాడు' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# సంపాదకీయం

గురువారం 30 సెప్టెంబరు 2021

## ఆఫ్గన్ లో ప్రారంభమైన ఆరాచకాలు

తాలిబన్ల రాజ్యం ఆఫ్ఘనిస్తాన్‌లో ఆటవిక పాలన మొదలైంది. అఫ్గనిస్థాన్‌లో తాలిబన్ల అరాచకాలు షరా మూమలుగా కొనసాగుతున్నాయి. ఇస్లామిక్ చట్టాల ప్రకారమే పాలన కొనసాగుతుందని తమ చర్యల ద్వారా తాలిబన్లు తెలియజేస్తున్నారు. తాజాగా, హెల్మాండ్ ప్రావిన్సుల్లో క్షౌరశాలలకు 'గడ్డం' గీయవద్దంటూ హుకుం జారీ చేశారు. గడ్డం తొలగించడం లేదా కత్తిరించడం ఇస్లామిక్ చట్టానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. అంతేకాదు, హెయిర్ కట్స్ విషయంలోనూ షరియా చట్టాలను పాటించాల్సిందేనని తెల్చిచెప్పారు. ఇవే ఆదేశాలు తమకూ అందాయని కాబూల్‌లోని కొందరు సెలూన్ నిర్వాహకులు వెల్లడించారు. తాలిబన్ ఫైటర్లు తరుచూ తమ సెలూన్ వద్దకు వచ్చి గడ్డం గీయవద్దని ఆదేశిస్తున్నట్లు కాబూల్‌కి చెందిన ఓ సెలూన్ నిర్వాహకుడు తెలిపారు. వీటిపై తనిఖీలకు ఇన్‌స్పెక్టర్లను కూడా పంపుతామని హెచ్చరించారని పేర్కొన్నాడు. మరో సెలూన్ యజమాని మాట్లాడుతూ.. తాలిబన్ ప్రభుత్వ అధికారి పేరుతో తనకు ఓ ఫోన్ కాల్ వచ్చిందన్నారు. ఇకపై అమెరికన్ హెయిర్ స్టైల్స్ చేయవద్దని తనను హెచ్చరించాడని చెప్పారు. దక్షిణ అఫ్గనిస్థాన్‌లోని హెల్మాండ్ ప్రావిన్సుల్లో గడ్డం గీయడం, పశ్చాత్య దేశాల హెయిల్ స్టయిల్స్‌పై నిషేధం విధించారు' అని పేర్కొంటూ ఫ్రాంటియర్ పోస్ట్ తాలిబన్ల పేరుతో ఉన్న లేఖను ప్రచురించింది. 'ఇస్లామిక్ ఓరియంటేషన్ మంత్రిత్వ శాఖ అధికారులు.. హెల్మాండ్ రాజధాని లష్కర్ గాహ్‌లోని పురుషుల క్షౌరశాలల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో హెయిర్ స్టైలింగ్, గడ్డం గీయవద్దని సూచించారు.. సెలూన్లలో సంగీతం, శ్లోకాలను కూడా వినిపించరాదని ఆదేశించారు.. ఈ ఆదేశాలను సోషల్ మీడియాలోనూ ప్రచారం చేయాలని తెలిపారు' అని పేర్కొంది. ప్రజల వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో పని లేకుండా తాలిబన్లు చెప్పినట్లు నడుచుకోవాల్సిందే. 1996-2001 వరకు సాగిన తాలిబన్ల పాలనలో స్టైలిష్ హెయిర్ కట్స్‌పై నిషేధం విధించారు. పురుషులు గడ్డం తీసుకోవద్దని ఆంక్షలు కొనసాగించారు. అయితే తాలిబన్ల పాలన ముగియడంతో అఫ్గన్లు క్లీన్ షేవ్, స్టైలిష్ హెయిర్ కట్స్‌కు అలవాటుపడ్డారు. తాజాగా, మళ్లీ ముష్కరుల ఆంక్షలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తాలిబన్ల చేతిలో చావడం కన్నా గడ్డం తీయకపోవడమే బెటర్ అని వారు భావిస్తున్నారు. ఆటవిక శిక్షలతో తాలిబన్లు నరరూప కాలకేయులు లాగా ప్రవర్తిస్తున్నారు. మహిళలపై ఆంక్షలతో ప్రారంభమైన తాలిబన్ల పాలన.. బహిరంగ ఉరిశిక్షలు, చేతులు, కాళ్లు నరికివేతలు, క్షౌర శాలలపై నియంత్రణ లాంటి చట్టాల వరకూ వెళ్లింది. కఠిన షరియా చట్టాల అమలు చేస్తూ తాలిబన్లు నరరూప హంతకుల్లా మారుతున్నారు. దీంతో ప్రజలు బయటకు వచ్చేందుకే భయపడుతున్నారు. ఈ క్రమంలోనే కొంతమందిని బహిరంగంగా ఉరితీసిన తాలిబన్లు.. క్రేన్‌తో నడిరోడ్డుపై వేలాడదీసి క్రూరత్వాన్ని మరోసారి చూపించారు. అంతేకుండా చిన్నారులను సైతం బహిరంగంగా చంపుతూ దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. తాలిబన్లు ఓ బాలుడిని బహిరంగంగా దారుణంగా చంపారు. ఆ బాలుడి తండ్రి తాలిబన్ల వ్యతిరేక దళంలో పనిచేస్తున్నాడనే అనుమానంతో తాలిబాన్లు చిన్నారిని ఉరివేసి చంపారు. ఈ ఘటన ఆఫ్ఘనిస్తాన్‌లోని పంజ్‌షీర్ తఖర్ ప్రావిన్స్‌లో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆ దేశంలోని పరిస్థితులను కవర్ చేసే ఒక స్వతంత్ర మీడియా సంస్థ పంజ్‌షీర్ అబ్జర్వర్ షేర్ చేసింది. బాలుడి మృతదేహం పక్కన మరో ముగ్గురు చిన్నారులు ఏడుస్తూ కూర్చొని ఉన్నట్లు మీడియా తెలిపింది. తాలిబన్లు మరింత క్రూరత్వంగా తమ మార్క్ పాలనను చూపిస్తున్నారంటూ అంతర్జాతీయ మీడియా పేర్కొంది. చిన్నారిని ఉరి తీయడం హక్కులను హరించడమేనని పేర్కొంది. ఆగష్టు 15న దేశాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబాన్లు.. ప్రతీకార దాడులు జరగవని హామీ ఇచ్చారు. అయితే.. పంజ్‌షీర్‌ను స్వాధీనం చేసుకునే క్రమంలో.. వ్యతిరక దళాలు, తాలిబన్ల మధ్య భీకర పోరాటం జరిగింది. ఈ ఘర్షణల్లో చాలామందిని తాలిబన్లు చంపారు. తాలిబన్లకు వ్యతిరేక గళం వినించిన వారిపై ప్రతీకార హత్యలకు పాల్పడుతున్నారు. రోడ్డుపై వెళ్లే వారిని ఆపి.. మొబైల్స్ చెక్ చేస్తున్నారని.. వారి వ్యతిరేకమని తేలితే.. చంపుతున్నారంటూ ప్రజలు మీడియాకు వెల్లడించారు. తాలిబన్ల ఆటవిక రాజ్యంలో అణచివేతలు, హత్యలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## గిరిజనులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

తుగ్గలి సెప్టెంబర్ 29 తుగ్గలి మండలం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువు తాండ వద్ద అనంతపురం జిల్లా పోలీసులు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో బుధవారం రోజున గిరిజనల పరివర్తన సదస్సు ను నిర్వహించారు. ఈ సదస్సుకు కర్నూలు, అనంతపురం జిల్లాల సుగాలీలందరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుగాలీలను ఉద్దేశించి అనంతపురం జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి మాట్లాడుతూ గిరిజనులు తమ వృత్తి అయిన నాటుసారా ను తయారు చేయడం మానుకుని ఇతర వ్యాపారాలు, పనులు చేసుకుని జీవనం కొనసాగించాలన్నారు. అలాగే తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం గుంతకల్ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది గిరిజనులు మంచి చదువులు చదివి ఉన్నత స్థానాలలో ఉన్నారని తెలియజేసారు. సుగాలీల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, వాటిని ఉపయోగించుకొని సుగాలీలందరూ అభివృద్ధి చెందాలని ఆయన తెలియజేసారు. అనంతరం మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్ కు అనంతపురం జిల్లా ఎస్పీ ఫకీరప్ప మరియు

### అనంత ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి
### సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే వెంకట రామి రెడ్డి.

గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా గిరిజనులలో కూడా మార్పు వచ్చిందని ఆయన తెలియజేసారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామ్మోహన్, డిఎస్పి చైతన్య, సీఐ, ఎస్.ఐ లు, వైఎస్ఆర్సిపి ఎస్.టి సెల్ మండలాధ్యక్షులు భీమానాయక్, జడ్పిటిసి పులికొండ నాయక్, మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్, మాజీ ఎంపీపీ నారాయణ నాయక్, ఎంపిటిసి రాందాస్ నాయక్, సర్పంచ్ లు బాలమ్మ, ఎల్లి భాయి, సర్పంచ్ ల గౌరవ సలహాదారులు బాబు నాయక్, శంకర్ నాయక్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కృష్ణ నాయక్, గిరిజన నాయకులు అశోక్ నాయక్, గోవిందు నాయక్, హనుమంతు నాయక్, సోమ్లా నాయక్, రాము నాయక్ తదితర గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

## రాయలసీమ ఉద్యమనేత ఎంవిఆర్ కన్నుమూత

కడప, సెప్టెంబర్29(ఆర్ఎన్ఎ): ప్రముఖ రాజకీయ నాయకుడు, సాహితీవేత్త, తొలి రాయలసీమ ఉద్యమ కారుడు ఎంవి.రమణారెడ్డి ఇకలేరు. గత పదినెలలుగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ రమణారెడ్డి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. గతరాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో కర్నూలు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం రమణారెడ్డి తుదిశ్వాస విడిచారు. కడప జిల్లాకు చెందిన రాజకీయ నాయకుడు ఎంవి.రమణారెడ్డి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు హయాంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా గెలిచారు. రమణారెడ్డిని తొలి రాయలసీమ ఉద్యమకారుడుగా చెప్పుకుంటారు. రాయలసీమ విమోచన సమితిని ఏర్పాటు చేసి రాయలసీమ వెనుకబాటుతనం, సీమ హక్కులు, సమస్యలపై పరిష్కారం కోసం ఉద్యమాలను చేపట్టారు. గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదివారు. గుంటూరులో రమణారెడ్డి చదివే రోజుల్లో కవిత అనే మాసపత్రికను కొంతమంది మిత్రులతో కలిసి నడిపారు. ప్రభంజనం అనే రాజకీయ పక్షపత్రికను కొంతకాలం వెలువరించారు. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులలో రమణారెడ్డి ఒకరు. రాయలసీమ వెనుకబాటుతనం, హక్కులు సమస్యలపై కన్నీటి గాథ కథ రచించారు. ఇటీవల ప్రపంచ చరిత్ర నాలుగు సంపుటాల రచనను కూడా ప్రచురించారు. రమణారెడ్డి రచనలు ఉదయం, జ్యోతి, ఆంధ్రప్రభ, ఇండియాటుడే, ఈనాడు, సాక్షి, రచన, నవ్య, సీమ సాహితి, తదితర పత్రికలలో ప్రచురింపబడ్డాయి. రాజకీయ నాయకుడిగా, సాహితీవేత్తగా రమణారెడ్డి సేవలందించారు. రాయలసీమ

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన రమణారెడ్డి
### ఉద్యమనేతకు పలువ్వురు గనంగా నివాళి
### సీమ వెనకబాటుతనపై ఆయన పోరాటం మరవలేనిదని వెల్లడి

ఉద్యమ నాయకుడుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఆయన ఉపన్యాసం, సాహిత్యం, ఉద్యమం ఉన్నాయి. రాయలసీమ వెనుకబాటుపై ఉద్యమ స్ఫూర్తిని రగల్చిన వైతాళికులు రమణారెడ్డి మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. రాయలసీమ అభివృద్ధికి దేశంలో వారు చేసిన పోరాటం పాలకులపై ఒత్తిడి పెంచి అనేక సాగునీటి ప్రాజెక్టుల అంకురార్పణకు దోహదపడిందన్నారు. నాలుగు దశాబ్దాలు గడుస్తున్నా అసంపూర్తిగా ఉన్న ఈ ప్రాజెక్టులకు నికర జలాలతో పూర్తి చేయించాడానికి పాలకులపై ఒత్తిడి పెంచే ఉద్యమ పోరాటాలతో వారికి ఘన నివాళి అర్పిద్దామన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబానికి మనో ధైర్యం కలిగించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామని వేదన భరిత హృదయంతో వివరించారు. రమణారెడ్డి మృతిపట్ల తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రమణారెడ్డి రచయిత, గొప్ప మేధావి అంటూ కొనియాడారు. ఎంవి.రమణారెడ్డి మృతిపట్ల సీనియర్ జర్నలిస్ట్ తెలకపల్లి రవి సంతాపం తెలిపారు.

## పోసానికి వ్యతిరేకంగా నిరసనలు

విజయవాడ, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్): సినీ నటుడు పోసాని కృష్ణ మురళికి వ్యతిరేకంగా తెలుగు రాష్ట్రాల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఆందోళన కొనసాగిస్తున్నారు. అమరావతి తాడేపల్లి ప్రాంతంలోని గుండిమెడలో సినీనటుడు పోసాని క్రిష్ణ మురళి దిష్టి బొమ్మ దహనం చేశారు ఆందోళనకారులు. పవన్ కళ్యాణ్ గురించి మరక్కొ మాట మాట్లాడితే, పోసాని భవిష్యత్ లో కఠిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని పవన్ అభిమానులు హెచ్చరిస్తూ నినాదాలు చేశారు. మరోవైపు, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామజోగయ్య ఫైర్ అయ్యారు. ఇప్పటికే లేఖ రిలీజ్ చేసిన జోగయ్య.. పవన్ కళ్యాణ్ ను వ్యక్తిగతంగా విమర్శిస్తున్న వైసీపీ మంత్రులు వెనుక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హస్తం ఉందని ఆయన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఆరోపించారు. ముఖ్యమంత్రి కాపులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ ని ఆరాధించే కాపుల సత్తా ఏంటో వచ్చే ఎన్నికల్లో చూపిస్తామని ఆయన శపథం చేశారు. పోసాని కృష్ణ మురళి ఒక జోకర్ అతని మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు అంటూ చేగొండి వెంకట హరిరామజోగయ్య కొట్టిపారేశారు. పోసాని పై టీడీపీ సంచలన వ్యాఖ్యలునటుడు పోసానిపై ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ రెడ్డి, ప్రశాంత్ కిషోర్ వికృత క్రీడకు పెయిడ్ ఆర్టిస్ట్‌గా పోసాని మారిపోయాడని విమర్శించారు. సామాన్యులు వినలేని భాషలో వైసీపీ నేతలు మాట్లాడుతుంటే జగన్ రెడ్డి ఆనందంలో మునిగి తేలుతున్నారని అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మీద పోసాని కామెంట్ల నేపథ్యంలో అచ్చెన్న ఇవాళ అమరావతిలో ఒక ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. పోసాని బూతులు సభ్య సమాజం తలదించుకునే విధంగా లేవా? జుబుత్సాకరమైన భాషను ప్రయోగించి సంస్కృతి సాంప్రదాయాలను మంటగల్పుతున్నారు. పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యుల గురించి పోసాని కృష్ణ మురళీ చేత ప్రశాంత్ కిషోర్ టీం మాట్లాడిస్తుంటే జగన్ రెడ్డి ఎందుకు బహిరంగంగా వారించలేదు. సామాన్యులు వినలేని.. మాట్లాడలేని భాషలో వైసీపీ నేతలు మాట్లాడుతుంటే తాడేపల్లిలో జగన్ రెడ్డి ఆనందంలో మునిగితేలుతున్నారు. మద్యం షాపుల దగ్గర చీప్ లిక్కర్ తాగిన తాగుబోతులు కూడా ఈ విధంగా మాట్లాడరేమో?" అని అచ్చెన్న అన్నారు. 2 లక్షల కోట్ల డ్రగ్స్ మాఫియాకు ఆంధ్ర రాష్ట్రం అడ్డాగా మారింది. మాఫియాలో ఆఫ్ఘన్ టెర్రరిస్టులు కూడా కుమ్మక్కై దేశ ద్రోహానికి పాల్పడుతున్నారు. ధరలు పెంచడం, దోపిడీ పాల్పడటం వంటి వాటితో ప్రభుత్వంపై పెరిగిన ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు ప్రశాంత్ కిషోర్ డైరెక్షన్ లో వైకాపా నేతలు కుల, మత, ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొడుతున్నారు. రాజకీయ విమర్శలకు బూతులు కాకుండా ప్రజా స్వామ్య స్ఫూర్తిని కొనసాగించేలా మాట్లాడకపోతే సరైన సమయంలో ప్రజలు మీకు గుణపాఠం చెబుతారని మర్చిపోకండి." అంటూ అచ్చెన్నాయుడు వైసీపీ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మూడు కిక్కులు, ఆరు దమ్ములుగ విరాజిల్లుతున్న గంజాయి దందా



హైదరాబాద్ సెప్టెంబర్ 29 హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పెరిగిపోతున్న గంజాయి దందాపై తెలంగాణ బీజేపీ నేత, సినీ నటి విజయశాంతి ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు. "రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో గంజాయి దందా మూడు కిక్కులు, ఆరు దమ్ములు అన్న చందంగా మారింది. ఒకప్పుడు పంజాబ్‌లో ఎలాంటి దందా జరిగిందో ఇప్పుడు తెలంగాణలోనూ అలాంటి దందా జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదంటూ సోషల్ మీడియా వేదికగా విజయశాంతి ప్రశ్నించారు. ఒకప్పుడు పంజాబ్ రాష్ట్రంలో గంజాయి దందా ఎలా జరిగిందో... రాష్ట్రంలో ఇపుడు అదే జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ఇటీవల సైదాబాద్‌లోని సింగరేణి కాలనీలో ఒక చిన్నారిపై హత్యాచారానికి పాల్పడ్డ రాజు గురించి విచారించిన పోలీసులు.. అతనికి ఉన్న వ్యసనం గంజాయి అనీ... ఆ మత్తులోనే కిరాతక ఘాతుకానికి పాల్పడ్డాడని... పోలీసుల విచారణలో తేలిందంటే ప్రభుత్వం ఎంత నిద్ర మత్తులో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే, గంజాయి కేవలం సింగరేణి కాలనీకే పరిమితమయ్యిందా?... అంటే నమ్మడం అసాధ్యం. పాఠశాలలకు వెళ్లాల్సిన చిన్న పిల్లలు మొదలు, పెద్దవారు, బడాబాబులు సైతం గంజాయికి బానిసలయ్యి మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు పాల్పడుతున్న ఉదంతాలు అందుకు నిదర్శనం. నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో సెలబ్రిటీలు, ఆకాశాన్ని తాకే బహుళ అంతస్తుల మధ్యలోని బస్తీల్లో గంజాయి దందా జోరుగా సాగుతున్నా...

### తెలంగాణ బీజేపీ నేత, సినీ నటి
### విజయశాంతి ప్రభుత్వం పై నిప్పులు

పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. బస్తీల్లోకి వెళ్లేందుకు కూడా పోలీసులు సాహసం చేయడం లేదంటే... ఎంత నెట్‌వర్క్‌తో గంజాయి దందా నడుస్తోందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు నగరంలోని వివిధ పార్కుల్లో యువత సిగరెట్‌లోని పొగాకు తీసి, గంజాయి కుక్కి సేవిస్తూ మత్తులో ఊగుతున్నారంటే... తెలంగాణ యువత ఎంతటి దౌర్భాగ్య స్థితికి దిగజారుతోందో అర్థం చేసుకోవచ్చు. ఇంకా.... చీకటి ముసుగులో నగర గల్లీగల్లీలో యువత గంజాయికి ఎంతగా ప్రభావితులు అవుతున్నారో ఆ దేవుడికే తెలియాలి. యువత ఇంతలా చెడిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు ఉండడం సిగ్గుచేటు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికైనా స్పందించి గంజాయి మత్తు నుంచి యువతరాన్ని కాపాడే ప్రయత్నం చేస్తే మంచిది." అంటూ సోషల్ మీడియాలో విజయశాంతి పోస్ట్ చేశారు.

## పవన్ కళ్యాణ్ పై పోసాని కృష్ణమురళి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

విశాఖపట్నం జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పై, సినీ ప్రముఖుడు పోసాని, కృష్ణమురళి అనుచిత వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేసినందుకు గాను, దీనికి నిరసనగా జనసేన పార్టీ నాయకులు సాయిబాబా శ్రీరాములు ఆధ్వర్యంలో అరకు నియోజకవర్గ కేంద్రంలో ముందుగాను పోసాని, కృష్ణమురళి పై తగు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ, అనంతరం కృష్ణ మురళి దిష్టిబొమ్మను దగ్ధం చేసారు, ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాదల శ్రీ రాములు, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ లక్ష్మణ్ రావు, ఎక్స్ ఎంపిటిసి సాయిబాబా, దురియా, అరకు నియోజకవర్గ నాయకుడు బంగారు రామదాసు, ఎల్బి రవీంద్ర, అల్లంగి, రామకృష్ణ , కొన్నేడి చిన్నబాబు రాజు ప్రసాద.రవి. తదితరులు అర్జున్ పాల్గొన్నారు

## ముగ్గురు కుటుంబసభ్యులు ఆత్మహత్యాయత్నం

గుంటూరు సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్) గుంటూరు జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాత్నం చేసారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన భోజనపల్లి సత్యశ్రీధర్ ట్రాన్స్పోర్టు కంపెనీలో పనిచేస్తున్నాడు. కరోనా కారణంగా గత ఏడాది నుంచి పనులు లేక శ్రీధర్ పలు చోట్ల అప్పులు చేశాడు. అప్పులు తిరిగి చెల్లించాలని భాదితులు వత్తిడి తిడుకురావడంతో అప్పుల బాధలు తాళలేక శ్రీధర్, అతని భార్య విజయ గౌరీ, కూతురు లక్ష్మి ఆశ జ్యోతి ఎలుకలు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. వారి ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాఆసుపత్రికి తరలించారు.

## అన్నవరం దిగువ ఆపచారం

అన్నవరం సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా తొండంగి పోలీసులు అన్నవరం దేవస్థానం కింద ఓ ప్రైవేట్ గెస్టౌ?సలో పేకాట ఆడుతూ మంగళవారం రాత్రి పట్టుబడ్డారు. శేషాద్రి సదన్లో పేకాట ఆడుతున్న ఏఎ?సఐ రమణ, హెడ్కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుల్ పాములురాజుతోపాటు రమేశ్ అనే మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.15,080 స్వాధీనం చేసుకున్నారు. అదే లాడ్జి ప్రాంతంలో ఆరుగురు విటులు, ముగ్గురు మహిళలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## రాయలసీమ సాహితీ రత్నం డాక్టర్ ఎం వీ రమణా రెడ్డికి తిరుపతి ఎమ్మెల్యే భూమన నివాళి

తిరుపతి సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్) ప్రముఖ రచయిత, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం వీ రమణా రెడ్డి మృతికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. రాయల సీమ సాహితీరత్నం డాక్టర్ రమణా రెడ్డి మన మధ్య లేకపోవడం తీరని లోటు. బహుముఖ ప్రజ్ఞాశాలి అనే మాటకు నిలువెత్తు నిదర్శనం డాక్టర్ ఎం.వి.రమణారెడ్డి వైద్యంలో పట్టభద్రుడైనా.. తెలుగు, ఇంగ్లీష్ సాహిత్యం, సంగతం , సినీమా కళల్లో ఆయన లెక్కకు మించి గౌరవ డాక్టరేట్లు పొందారు. డాక్టర్ ఎం వీ రమణా రెడ్డి తన తుది శ్వాస వదిలే దాకా కాలాన్ని విడిచిపెట్టని మన కాలం వీరుడు. డాక్టర్ ఎం వీ రమణా రెడ్డి రెక్కలు చాచిన పంజరం, చివరకు మిగిలేది ( గాన్ విత్ ద విండ్) వంటి ప్రపంచ ప్రఖ్యాత నవలలను అనువదించి, తెలుగు పాఠకులకు అందించిన ధన్యజీవి అయన అని అన్నారు. డాక్టర్ ఎం వీ రమణా రెడ్డి ఇటీవల రాసిన ప్రపంచ చరిత్ర ను చదివి ఆయన జ్ఞానానికి అబ్బురపడి, కాస్త జ్ఞానాన్ని సంపాదించుకున్న వారిలో నేనూ ఒక్కడినే. డాక్టర్ ఎం వీ రమణా రెడ్డి కి ఇదే నా అశ్రు నివాళని అన్నారు.

## చెత్త సేకరించిన సర్పంచ్

తిరుపతి తిరుపతి రూరల్ (మం) పుదిపట్ల పంచాయతీ సర్పంచ్ బడి సుధాయాదవ్ వినూత్న నిరసన కు దిగారు. తానే చెత్త సేకరించారు. అయన మాట్లాడుతూ పంచాయతీ నిధులు ఆపేశారు...లేనిపోని ఘర్షణలు సృష్టిస్తూ కేసులు పెడుతున్నారు. పార్టీల మద్దతు కాదని స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందితే ఇన్ని రకాలుగా వేదింపులా. పది రోజులుగా పంచాయతీలో చెత్త సేకరణ ఆపేశారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలు ఇబ్బందులు పడుకూడదనే చెత్త సేకరణ చేపట్టాను. అధికారులు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని అన్నారు.

## డాక్టర్ ఎంవీ రమణారెడ్డి మృతి

కర్నూలు రాయలసీమ రాజకీయ కురువృద్ధుడు మొదటి తరం రాయలసీమ ఉద్యమ నాయకుడు 1983 – 84లో నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో "రాయలసీమ కరువు బండ" పేరుతో రాయల సీమకు నికర జలాల కోసం పోరాటం చేసినటువంటి వ్యక్తి డాక్టర్ ఎం.వి.రమణారెడ్డి కర్నూల్ లోని మెడికల్ హాస్పిటల్ లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ పరమపదించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే గా పని చేస్తూ వైద్య వృత్తి లో కొనసాగుతూ పీడిత ప్రజల తరపున న్యాయ పోరాటం చేయడానికి న్యాయ విద్య అభ్యసించి కోర్టులో వాదించి నటువంటి గొప్ప మానవతావాది. అదేవిధంగా డాక్టర్ ఎం.వి.రమణారెడ్డి మంచి కవి రచయిత వారు రచించిన రచనలలో సినిమా స్వర్ణయుగం, ప్రపంచ చరిత్ర-4 భాగాలు బహుళ ప్రజాదరణ పొంది వున్నాయి. అదే విదంగా రాయలసీమ కన్నీటి గాథ అనే పుస్తకం అనేక సార్లు పునరముద్రాన జరిగి రికార్డ్ స్థాయి లో అమ్ముడు పోతూనే వుంది.. ఆతీ. ఓం రమణ రెడ్డి బహుముఖ ప్రజ్ఞశాలి. ఎన్నడూ ఆడంబరాలుకీ పోనీ వ్యక్తి. ఈనాటి రాయలసీమ మలితరం ఉద్యమకారులకు ఒక చుక్కని...మార్గదర్శి. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చవి చూసి చివరి క్షణం వరకు ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తి దీర్ఘకాలం ఉబ్బసం వ్యాధితో బాధపడుతూ ఈరోజు ఉదయం ఏడు గంటలకు కర్నూలు మెడి కవర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ పరమపదించారు విషయం తెలుసుకున్న వెంటనే రాయలసీమ ఉద్యమ కారులు హుటాహుటిన మెడి కవర్ హాస్పిటల్ కి చేరుకొని వారి పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. రాయలసీమ ఉద్యమ కారులు అయినటువంటి రాయలసీమ జనార్ధన్, వివి నాయుడు ఖానాపురం కృష్ణారెడ్డి, విద్యార్థి నాయకులు సీమ కృష్ణ రవి, రంగముని సురేందర్ రెడ్డి శేఖర్ తదితరులు డాక్టర్ ఎం.వి.రమణారెడ్డి నింగికెగిసిన నేల తార అనీ ఎప్పటికీ ఆ నీలాకాశంలో ఉంటూ రాయలసీమ ఉద్యమకారులకు చుక్కానిగా ఉంటరని అన్నారు. ఉద్యమం ఒక పెద్ద దిక్కు ను కోల్పోయింది అనీ రాయలసీమ నిర్మాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాయలసీమ జనార్ధన్ అన్నారు.

## తీరని డోలి కష్టాలు

విజయనగరం, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)గిరిజనుల డోలీ కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. అసలే వానలు..ఆపై అస్తవ్యస్తమైన రోడ్లు.. దీంతో హాస్పిటల్‌కి వెళ్లాలంటే నరకయాతన తప్పడం లేదు. విజయనగరం జిల్లాలో మరో హృదయవిదారక ఘటన అందర్నీ విస్తుపోయేలా చేసింది. మెంటాడ మండలం ఎనుగువలసలో నంద్యాన కాసులమ్మ అనే గర్భిణికి పురిటినొప్పులు వచ్చాయి. కంగారుపడ్డ కుటుంబసభ్యులు ఆమెను డోలీ సాయంతో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. దాదాపు 10కిలోమీటర్లు వాగులు, వంకలు, పొలాల మధ్య డోలీలో కాసులమ్మను హాస్పిటల్‌కి తరలించే ప్రయత్నం చేశారు. కానీ మార్గం మధ్యలో పురిటినొప్పులు ఎక్కువై కాసులమ్మ ప్రసవించింది. మరికొంత దూరం తల్లిబిడ్డను తీసుకెళ్లి అంబులెన్స్ సాయంతో స్థానిక పీహెచ్‌సీ తరలించారు. అటు విశాఖలోనూ సేమ్ సీన్ రిపీట్ అయింది. గులాబ్ తుపానుతో వాగులు వంకలు పొంగిపొర్లడంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో అనంతగిరి మండలం మల్లిపాడు గ్రామానికి చెందిన సోడిపల్లి లక్ష్మి అనే గర్భిణీకి పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే ఆమెను డోలీ సాయంతో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. దాదాపు 2 కిలోమీటర్లు తీసుకెళ్లారు. అయితే మార్గమధ్యలో గడ్డ వాగు పొర్లుతుండడంతో ఇవతలి వైపు నుంచి అవతలి వైపునకు వెళ్లలేకపోయారు.

# ఆయుర్వేద ఆనందయ్య కొత్త పార్టీ



నెల్లూరు, సెప్టెంబర్ 29,(న్యూస్ పల్స్) ఏపీ రాజకీయాల్లో మరో సంచలనం మొదలైంది. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంకు చెందిన ఆనందయ్య పేరు ఇటీవల మారు మోగిపోయింది. కరోనా రోగుల కోసం మందు తయారు చేసిన ఆనందయ్య.. కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. కరోనా వైరస్ విజృంభించిన సమయంలో ఆయుర్వేదం మందు తయారు చేసి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉచితంగా కరోనా మందును పంపిణీ చేశారు. జిల్లాలు, గ్రామాల్లో కూడా కరోనా మందును ప్రజలకు అందజేశారు. రాజకీయ పార్టీ ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటన రాష్ట్రంలో సంచలనం రేపింది. అన్ని కులాలను కలుపుకుని పార్టీ పెట్టాలని ఆనందయ్య నిర్ణయించినట్లు తెలుస్తోంది.కోవిడ్ సెకండ్ వేవ్ విజృంభిస్తోన్న సమయంలో.. ఆయుర్వేద మందు తయారీ చేసి ఆనందయ్య వార్తల్లో నిలిచారు. ఆనందయ్య మందు కొంతకాలం ఆగిపోయిన తర్వాత ఏపీ సర్కార్ అనుమతి ఇవ్వడంతో మందు పంపిణీ ప్రారంభించారు. ఆ సమయంలో ఆనందయ్యకు చాలా మంది మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలోనే తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో అఖిల భారత యాదవ మహాసభ 13 జిల్లాల సమైఖ్య సమావేశ యాత్ర సభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనందయ్య మాట్లాడుతూ.. జగన్ సర్కారుపై సంచలన కామెంట్స్ చేశారు. కరోనా మందు తయారీకి జగన్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని అన్నారు. త్వరలోనే యాదవుల రాజకీయ పార్టీ ప్రారంభిస్తామని ప్రకటించారు. మిగిలిన బీసీ కులాలతో కలిసి ప్రత్యేకంగా పార్టీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రథయాత్ర నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆనందయ్య చెప్పుకొచ్చారు. జాతీయ నేతల అండదండలతో బలహీన వర్గాలను కలుపుకుని వెళ్లాలని ఆనందయ్య ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే జగన్ ప్రభుత్వం నుంచి సహకారం లేదని కొన్ని సార్లు ఆవేదన వ్యక్తం చేసినా.. 13 జిల్లాల్లో కూడా ఆయుర్వేదం మందును పంపిణీ చేశారు. స్వయంగా ఆనందయ్యే మందును తయారు చేశారు. కరోనా సెకండ్ వేవ్ సమయంలో ఆనందయ్య మందు బాగా పని చేస్తోందంటూ సోషల్ మీడియాలో బాగా ప్రచారమైంది. దీంతో ఆయన ఒక్కసారిగా పాపులర్ అయిపోయారు. ఆనందయ్య మందు కోసం తెలుగు వారే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ క్రమంలో త్వరలోనే రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించడం సంచలనంగా మారింది.

# ఏపీలో రాక్షసులు వర్సెస్ దేవతలు

విజయవాడ, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)పురాణాల కాలంలో దేవతలు ఉండేవారు. వారు హీరోలు అయితే విలన్లుగా రాక్షసులు ఉండేవారు. దేవతలు యజ్ఞ యాగాదులు చేస్తే రాక్షసులు వాటిని భ్రష్టు పట్టించేలా వినాశనాలు చేస్తూ ఉండేవారు. మరి కలియుగంలో ఆధునిక కాలంలో కూడా రాక్షసులు ఉన్నారా. అంటే ఉన్నారని అధికార పక్షం అంటోంది. అది ఏ పార్టీకి చెందినది అని ప్రశ్న ఇక్కడ లేదు. అధికార పార్టీ అంటే హీరో, వారే దేవతలు, వారు చేసే పనులను అడ్డుకునే వారంతా రాక్షసులు. ఈ మాటను కనిపెట్టింది. రాక్షసులకు సరైన డెఫినిషన్ ఇచ్చినది తెలుగుదేశం పార్టీ. అప్పట్లో మాటకొస్తే చాలు టీడీపీ నేతలు వైసీపీ వారి మీద గట్టిగా విరుచుకుపడేవారు. తాము మంచి పనులు చేస్తూంటే చూసి ఓర్వలేక దానవుల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని ఘాటుగా మాట్లాడేవారు.ఇక ఇపుడు సర్కార్ మారింది. అధికారం కూడా వారి నుంచి వీరి వైపునకు వచ్చింది. నాడు రాక్షసులుగా టీడీపీ వారి చేత తిట్లు తిన్న వైసీపీ వారు దేవతలు ఒక్కసారిగా అయిపోయారు. ఇక విపక్షంలో వచ్చిన టీడీపీ వారు రాక్షసులుగా రోల్ మార్చేశారుట. అవును మరి ఇపుడు వైసీపీ నేతలు తరచూ ఇదే మాట అంటున్నారు. సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ దగ్గర నుంచి మొదలుపెడితే వైసీపీ సాధారణ నాయకుడి వరకూ అందరూ టీడీపీ చేష్టలను రాక్షులతో పోలుస్తూ తెగ విమర్శలు చేస్తున్నారు. వైసీపీ సర్కార్ చేసే ప్రతి మంచి పనినీ అడ్డుకోవడమే తెలుగుదేశం పని అని కూడా వారు అంటున్నారు.సరే టీడీపీ, వైసీపీ నేతలు రాజకీయాలకు అనుగుణంగా పాత్రలు మార్చుకుంటున్నారు. దేవ దానవ సంగ్రామం గత ఏడేళ్ళుగా ఏపీలో రంజుగా సాగుతోంది. ఎవరు గెలిచారో ఓడారో కానీ మధ్యన నలిగిపోతున్నది మాత్రం అచ్చంగా ప్రజలే. అయిదు కోట్ల మంది ప్రజలు ఇంతకీ ఏ పాత్ర పోషిస్తున్నారు అన్నదే ప్రశ్న. అలాగే వారు ఏ పాపం చేశారని ఇలా అభివృద్ధి ఫలాలు దక్కకుండా అడ్డుకుంటున్నారు అన్నది కూడా పాయింటే. మరి జగన్ అయినా చంద్రబాబు అయినా ప్రజలకే జవాబుదారిగా ఉండాలి. అంతిమంగా వారే ఫలాలను, ఫలితాలను పొందలసిన వారు. ద్వేషముంటే అది రాజకీయ పార్టీలకే పరిమితం కావాలి తప్ప ప్రజల పొట్ట కొట్టకూడదు. కానీ ఏపీలో జరుగుతున్నది మాత్రం కంప్లీట్ డిఫరెంట్ గానే ఉంది అంటున్నారు.దేశంలో ఏ రాష్ట్రంలో లేని విచిత్ర పరిస్థితి ఏపీలో ఉంది. ఇక్కడ అధికార, ప్రతిపక్షాలైన వైసీపీ, టీడీపీ ప్రజాస్వామ్యంలో ఉన్నట్లుగా తమ పాత్రలను పోషించడంలేదు అంటున్నారు. ఏకంగా రాక్షసులు, దేవతలు అన్నట్లుగా భారీ విభజన గీసేసుకుని మరీ పురాణ కాలం నాటి రాజకీయమే చేస్తున్నారు. రెండు పక్షాలు కలసి ప్రజలకు మేలు చేయాలని ఏ కోశానా ఆలోచించకపోవడం వల్లనే ఏపీలా ఈ రాక్షస సంగ్రామం ఇలా నిర్విరామంగా సాగుతోంది అని మేధావులు అంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధి కోసం ఒక్కటి అయితేనే జనాలు ఈ రాజకీయాన్ని హర్షిస్తారు అని కూడా అంటున్నారు. మార్పు కొరకు ఎదురుచూడాలి మరి.

# ఇద్దరు నానిలకు గండం లేదట

విజయవాడ, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంత్రి వర్గ విస్తరణకు సిద్దమయ్యారు. ఈ మంత్రివర్గ విస్తరణ సంక్రాంతికి ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిజానికి జగన్ లెక్క ప్రకారం వచ్చే నెలలో మంత్రివర్గ విస్తరణ జరగాల్సి ఉంది. అయితే మరో మూడు నెలల పాటు దీనిని జగన్ వాయిదా వేశారు. కొత్త ఏడాది సంక్రాంతి పండగ సమయంలో నూతన మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేయబోతున్నట్లు వైసీపీలో చర్చ జరుగుతోంది.అయితే ఈసారి వంద శాతం మంత్రులను మార్చబోతున్నట్లు సంకేతాలను బయటకు పంపారు. కానీ ఇది సాధ్యం కాదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొందరికి మినహాయింపు ఉంటుందని పార్టీ కీలక నేతలు అభిప్రాయపడుతున్నారు. వీరిలో కీలకమైన శాఖలు, ముఖ్యమంత్రి జగన్ కు అత్యంత ఇష్టులు కేబినెట్ లో ఉండే అవకాశముందని తెలుస్తోంది. తనకు బంధువైన బాలినేని శ్రీనివాసులురెడ్డిని మంత్రి పదవి నుంచి తప్పించినా, కొందరిని మాత్రం జగన్ కంటిన్యూ చేసే అవకాశముంది.కొడాలి నాని విషయమే తీసుకుంటే ఆ సామాజికవర్గంలో సరైన నేత వైసీపీ లో లేరు. ప్రత్యర్థి పార్టీపై విరుచుకుపడటం, జగన్ కు దన్నుగా ఉండటం వంటివి కొడాలి నానికి ప్లస్ పాయింట్. మంత్రిగా కొడాలి నాని సక్సెస్ అయ్యారా? లేదా? అన్నది పక్కన పెడితే కమ్మ సామాజికవర్గం నేతగా వైసీపీ క్యాడర్ లో నానిది ప్రత్యేక స్థానం. ఆయనను తప్పించి వేరే అదే సామాజికవర్గం నేతకు ఇవ్వాలన్నా సరైన నేత కన్పించడం లేదు.ఇక కాపు సామాజికవర్గానికి సంబంధించి కూడా ఒకరిద్దరు మంత్రులు జగన్ కేబినెట్ లో కొనసాగే అవకాశముంది. ఇందులో పేర్ని నాని వంటి వారి పేర్లు విన్పిస్తున్నాయి. పవన్ కల్యాణ్ వంటి వారి విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాలంటే పేర్ని నాని వంటి వారిని కంటిన్యూ చేయక తప్పదంటున్నారు. మొత్తం మీద జగన్ మంత్రి వర్గ విస్తరణ చేపట్టినా ఇద్దరు నానిలకు మాత్రం గండం లేదని పార్టీలో పెద్ద యెత్తున చర్చ జరుగుతోంది. సేఫ్ జోన్ లో మేకపాటిమేకపాటి గౌతం రెడ్డి వివాదాలకు దూరంగా ఉండే నేత. యువకుడు అయినా ఆయన రాజకీయ వివాదాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. జిల్లా రాజకీయాల్లోనూ ఆయనను వ్యతిరేకించే వారు తక్కువనే చెప్పాలి. మేకపాటి గౌతమ్ రెడ్డి జగన్ కు అత్యంత సన్నిహితుడిగా పేరు పొందారు. జగన్ చెప్పిన పనిని చెప్పినట్లు చేస్తారాయన. కీలకమైన పరిశ్రమల శాఖను చూసే మేకపాటి గౌతం రెడ్డిని వచ్చే కేబినెట్ లో కూడా కంటిన్యూ చేసే అవకాశాలున్నాయి.మేకపాటి కుటుంబం తొలి నుంచి జగన్ కు అండగా ఉంటూ వస్తుంది. జగన్ పార్టీ పెట్టిన నాటి నుంచి మేకపాటి రాజమోహన్ రెడ్డి పార్టీలో కీలకంగా మారారు. ఆయనకు 2019 ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదు. మేకపాటి కుటుంబంలో రెండు టిక్కెట్లు ఇచ్చిన జగన్ తొలి కేబినెట్ లోనే మేకపాటి గౌతం రెడ్డికి స్థానం కల్పించారు. పరిశ్రమల శాఖను ఆయనకు అప్పగించారు. ఆయన చేపట్టిన రెండేళ్లలో పెద్దగా రాష్ట్రానికి పరిశ్రమలు రాలేదు.ఇప్పుడిప్పుడే ఏపీలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. మేకపాటి గౌతంరెడ్డి కూడా పారిశ్రామిక వేత్త కావడంతో రానున్న కాలంలో ఆయన పరిశ్రమలను రాష్ట్రానికి తెప్పిస్తారని జగన్ అంచనా వేస్తున్నారు. మధ్యలో తప్పించి వేరే వారికి అప్పగిస్తే పారిశ్రామిక అభివృద్ధి రాష్ట్రంలో జరగదని జగన్ భావిస్తున్నారు. అందుకే జగన్ కంటిన్యూ చేసే మంత్రుల్లో మేకపాటి గౌతంరెడ్డి ఒకరన్న చర్చ పార్టీలో నడుస్తుంది. మేకపాటి రాజమోహన్ రెడ్డికి ఎలాంటి పదవి ఇవ్వకపోవడం కూడా ఆయనను కొనసాగిస్తారన్న సంకేతాలున్నాయి.ఇక మేకపాటి గౌతంరెడ్డిని తప్పిస్తే జిల్లాలో రెడ్డి సామాజికవర్గం నేతలను కూడా సంతృప్తి పర్చడం సాధ్యం కాదు. ఇప్పటికే అనేక మంది రెడ్డి సామాజికవర్గం నేతలు నెల్లూరు జిల్లాలో మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. వీరిలో ఎవరికి ఇచ్చినా మరొకరు అసంతృప్తికి గురయ్యే అవకాశముంది. ఆనం రామనారాయణరెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వంటి నేతలు ఆశలు పెట్టుకున్నారు.

# లగడపాటి మరోసారి రాజకీయాలు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)లగడపాటి రాజగోపాల్ ? పార్లమెంటు సభ్యుడిగా పదేళ్లు మాత్రమే ఉన్నా ఆయన రెండు తెలుగు రాష్ట్రాల్లో టాప్ లీడర్ అయ్యారు. దీనికి కారణం ఆయన కాంట్రవర్సీయే. రాష్ట్ర విభజన సమయంలో ఆయన చేసిన హడావిడితో తెలంగాణలో విలన్ గా, ఏపీలో విలన్ గా లగడపాటి రాజగోపాల్ బాగానే ఫోకస్ అయ్యారు. అయితే మరోసారి లగడపాటి రాజగోపాల్ పేరు ఇప్పుడు ఏపీలో బలంగా విన్పిస్తుంది.లగడపాటి రాజగోపాల్ మొన్నటి ఎన్నికల వరకూ సర్వేలతో హల్ చల్ చేసేవారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో ఆయన చేసిన సర్వేలు బొక్కా



బోల్తాపడ్డాయి. తిరిగి చంద్రబాబు అధికారంలోకి వస్తాడన్నారు. పవన్ కల్యాణ్ అసెంబ్లీలోకి అడుగు పెడతాడన్నాడు. జగన్ కు ముఖ్యమంత్రిగా అయ్యే ఛాన్స్ లేదని చెప్పాడు. కానీ వీటిలో అన్నీ రివర్స్ అయ్యాయి. లగడపాటి సర్వే బూమ్ రాంగ్ కావడం, ఫలితాల తర్వాత ఇక రెండు రాష్ట్రాల్లో కన్పించకుండా పోయారు.అయితే తాజాగా తెలుగుదేశం పార్టీలో లగడపాటి రాజగోపాల్ పేరు బలంగా విన్పిస్తుంది. ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని చెప్పడతో నాని వ్యతిరేకులు లగడపాటిని సంప్రదించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర విభజన సమయంలో లగడపాటి రాజగోపాల్ వ్యవహరించిన తీరుతో విజయవాడ వాసులు ఫిదా అయ్యారు. తన రాజకీయ జీవితాన్ని కూడా పణంగా పెట్టారన్న సానుభూతి ఉంది.దీంతో వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరుపున లగడపాటి రాజగోపాల్ ను పోటీ చేయించాలని టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమ మరి కొందరు నేతలు భావిస్తున్నారు. ఆయన పేరును తెరపైకి తెచ్చారు. నిజంగా లగడపాటి రాజగోపాల్ పోటీకి సై అంటే టీడీపీ ఖచ్చితంగా టిక్కెట్ ఇస్తుంది. లగడపాటికి వ్యక్తిగతంగా విజయవాడ ప్రాంతంలో ఓటు బ్యాంకు ఉండటమే ఇందుకు కారణం. మొత్తం మీద ఆయన పోటీ చేస్తారో? లేదో? తెలియదు కాని మరోసారి టీడీపీ వర్గాలే లగడపాటి రాజగోపాల్ పేరును బయటకు తీసుకురావడం విశేషం.

# ఉమా ఎందుకు సైలెంట్ అయిపోయారా



విజయవాడ, సెప్టెంబర్ 29, ః(న్యూస్ పల్స్)రాజకీయాల్లో శత్రువుల సహజం. అలాగే నమ్మకైన వారు కూడా వెన్నంటి ఉండాలి. అప్పుడే విజయం సాధ్యమవుతుంది. మాజీ మంత్రి దేవినేని ఉమకు మిత్రులకన్నా శత్రువులే ఎక్కువగా ఉన్నట్లుంది. రెండు దశాబ్దాలుగా దేవినేని ఉమ రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఆయన సంపాదించుకున్నది మాత్రం ఖచ్చితంగా శత్రువులననే చెప్పాలి. ఆయన గత రెండున్నరేళ్లుగా రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏదీ కలసి రావడం లేదు. తాను అనుకున్నవాళ్లే మోసం చేసి వెళ్లిపోయారు.దేవినేని ఉమ తెలుగుదేశంలో కీలక నేతగా ఎదిగారు. తన సోదరుడు దేవినేని వెంకటరమణ హఠాన్మరణంతో రాజకీయాల్లోకి వచ్చిన ఉమ ఎన్నడూ వెనుదిరగి చూసుకోలేదు. నాటి నుంచి నందిగామ, మైలవరం నియోజకవర్గాల నుంచి గెలుస్తూ వస్తున్నారు. తొలిసారిగా 2019 ఎన్నికల్లో దేవినేని ఉమకు ఓటమి ఎదురయింది. అప్పటి నుంచి దేవినేని ఉమకు కష్టాలు మొదలయ్యాయనే చెప్పాలి. జగన్ టార్గెట్ దేవినేని ఉమగానే కన్పిస్తున్నారు.2014లో గెలిచిన దేవినేని ఉమకు చంద్రబాబు ముఖ్యమైన ఇరిగేషన్ మంత్రి పదవి ఇచ్చారు. నాటి నుంచే దేవినేని ఉమ ఆప్తులను, సన్నిహితులను దూరం చేసుకున్నారు. అధికారంలో ఉండగా ఎవరినీ పట్టించుకోక పోవడం, ఎన్నికలు రాగానే కౌగిలింతలు రుచించని కొందరు నేతలు దేవినేని ఉమను గత ఎన్నికల్లో దెబ్బకొట్టారు. ఇప్పుడు తాజాగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సయితం దేవినేని ఉమకు ఘోర పరాజయం ఎదురయింది.మైలవరం నియోజకవర్గంలో వైసీపీ ఆధిక్యత దక్కించుకుంది. గొల్లపూడిలో 10 ఎంపీటీసీలకు 10 వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసిన టీడీపీ నేతలు సయితం వైసీపీ లో చేరిపోయారు. ఇది దేవినేని ఉమను మానసికంగా దెబ్బతీసినట్లయింది. దేవినేని ఉమను మైలవరం లో పూర్తిగా దెబ్బతీయడానికి వైసీపీ వేసిన వ్యూహంలో టీడీపీ నేతలు చిక్కుకు పోతున్నారు. దేవినేని ఉమ మాత్రం నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.

# బద్వేలు ప్రచారానికి దూరంగా జగన్

కడప, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స)బద్వేల్ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదలయింది. అక్టోబరు 30వ తేదీన ఎన్నిక జరగనుంది. వైసీపీ అభ్యర్థిగా వెంకటసుబ్బయ్య సతీమణి దాసరి సుధ పేరును వైఎస్ జగన్ ఖరారు చేశారు. డాక్టర్ వెంకట సుబ్బయ్య మరణంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమయింది. బద్వేలు ఉప ఎన్నికకు సంబంధించి జగన్ రెండు నెలల క్రితమే ప్రచారాన్ని ప్రారంభించారు. బద్వేలులో దాదాపు ఆరు వందల కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించి వచ్చారు.అయితే జగన్ బద్వేలు ఉప ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొనే అవకాశం లేదు. బద్వేలులో వైసీపీకి గట్టి పట్టుంది. టీడీపీ బలహీనంగా ఉంది. టీడీపీ కూడా గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన ఓబులాపురం రాజశేఖర్ పేరునే ఖరారు చేసింది. దీంతో సునాయాస విజయమేనని వైసీపీ భావిస్తుంది. ఈ కారణంగానే ముఖ్యమంత్రి జగన్ బద్వేలు ఉప ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటారని తెలుస్తోంది.ఇప్పటి వరకూ జరిగిన ఏ ఎన్నికల్లోనూ జగన్ ప్రచారంలో పాల్గొనలేదు. కార్పొరేషన్ ఎన్నికలు, పరిషత్ ఎన్నికలు జరిగినా ఆయన ప్రచారానికి దూరంగానే ఉన్నారు. తిరుపతి లోక్ సభ ఎన్నికల ప్రచారానికి జగన్ వెళదామనుకున్నా కరోనా కారణంగా చివరి నిమిషంలో వాయిదా వేసుకున్నారు. దీంతో ఇప్పటి వరకూ జరిగిన ఏ ఎన్నికలకూ జగన్ ప్రచారానికి పోలేదు. ఇదే తరహాలో బద్వేలు ఉప ఎన్నికల ప్రచారానికి జగన్ దూరంగా ఉండనున్నారని తెలిసింది.బద్వేలు నియోజకవర్గంలో టీడీపీ చివరి గెలుపు 2001 ఉప ఎన్నికలోనే. 2004 నుంచి వరసగా జరిగిన నాలుగు ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్, వైసీపీ గెలుస్తూ వస్తున్నాయి. రిజర్వడ్ నియోజకవర్గం అయిన తర్వాత టీడీపీ ఇక్కడ గెలవలేదు. దీంతో జగన్ ఈ ఉప ఎన్నికను లైట్ గానే తీసుకోనున్నారు. ప్రచారానికి దూరంగా ఉండనున్నారు. మండలాల వారీగా మంత్రులకు బాధ్యతలను త్వరలో జగన్ అప్పగించనున్నారు. భారీ మెజారిటీ రావాలని జగన్ నేతలకు లక్ష్యాన్ని నిర్దేశించనున్నారు.రంగంలోకి ఓబులాపురంవాస్తవానికి ట్రాక్ రికార్డు సరిగా లేదు. అయినా పార్టీని ట్రాక్ లో పెట్టాలంటే పోటీకి దిగాల్సిందే. బద్వేలు ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీకి సిద్దమయింది. 2001లో తెలుగుదేశం పార్టీకి బద్వేలులో చివరి గెలుపు. అంటే ఇక్కడ గెలిచి దాదాపు ఇరవై ఏళ్లు కావస్తుంది. తిరుపతి ఉప ఎన్నికల్లో మాదిరి ఓటు బ్యాంకును పటిష?టం చేసుకోవడం కోసం, ఫీడ్ బ్యాక్ ను తెలుసుకోవడం కోసం టీడీపీ? బద్వేలు ఉప ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెప్పక తప్పదు.గత ఎన్నికల్లోనే టీడీపీ దాదాపు 44 వేల ఓట్ల తేడాతో వైసీపీ అభ్యర్థిపై ఓటమిని చవిచూసింది. పైగా ఇది ఉప ఎన్నిక. అధికార పార్టీకే అడ్వాంటేజీ అని టీడీపీ అధినేత చంద్రబాబుకు తెలుసు. అయితే గత ఎన్నికల మెజారిటీని తగ్గించాలన్నదే చంద్రబాబు ఆలోచనగా ఉంది. పార్టీ క్యాడర్ ను మరింత పటిష్టం చేసుకోవడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీపై వ్యతిరేకత పెరిగిందన్న సంకేతాలను తీసుకెళ్లాలన్నది చంద్రబాబు ఆలోచన.అందుకోసమే ముందుగానే చంద్రబాబు అభ్యర్థిని ప్రకటించారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయిన ఓబులాపురం రాజశేఖర్ పేరును ఖరారు చేశారు. తొలుత ఆయన అంగీకరించకపోయినా ఖర్చు మొత్తం పార్టీయే భరిస్తుందని హామీ ఇచ్చి ఆయనను రంగంలోకి దింపుతున్నారు. ఇటీవలే ఇక్కడ టీడీపీకి కీలకంగా ఉన్న విజయమ్మను యాక్టివ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి కుమార్తె విజయమ్మ ఇక్కడ ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.బిజివేముల వీరారెడ్డి కుటుంబానికి ఇక్కడ మంచి పట్టుంది. 1994, 1999లో రెండుసార్లు ఆయన టీడీపీ నుంచి విజయం సాధించారు. మరో మూడేళ్లు ఎమ్మెల్యే పదవి ఉండనుండటంతో సహజంగా ప్రజలు కూడా నియోజకవర్గం అభివృద్ధి కోసం వైసీపీ వైపు మొగ్గు చూపుతారు. అయితే రాష్ట్రంలో అభివృద్ధి లేదన్నది బద్వేలు తీర్పు ద్వారా చూపించాలని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే ఆయన బద్వేలు ఎన్నిక ప్రచారానికి కూడా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. మండలాల వారీగా నేతలను నియమించనున్నారు. నేడో, రేపో కడప జిల్లా నేతలతో సమావేశాన్ని చంద్రబాబు నిర్వహించనున్నారు.

# రాజమండ్రి పంచాయితీకి జగన్ మార్క్ ఫుల్ స్టాప్

విజయవాడ, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)తాడేపల్లిలో రాజమండ్రి పంచాయతీ ముగిసింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ భరత్ రామ్ ల మధ్య సయోధ్య కుదిరింది. ఇద్దరికీ పరోక్షంగా హైకమాండ్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. భవిష్యత్ లో పార్టీ లైన్ దాటితే ఊరుకోబోమని హెచ్చరికలు జారీ చేసింది. దీంతో రాజమండ్రి పంచాయతీకి తాత్కాలికంగా తెరపడినట్లేనని చెబుతున్నారు. గంటల కొద్దీ తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఇద్దరిని కూర్చోబెట్టి విభేదాలను పరిష్కరించడానికి ప్రయత్నం చేశారు. కొంత కాలంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ భరత్ ల మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. ఇద్దరూ బహిరంగంగా పరస్పర దూషణలకు దిగారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించి కూడా వారు వ్యవహరిస్తున్న తీరు అధినాయకత్వాన్ని కూడా కలవరపర్చింది. ఇద్దరూ బలమైన సామాజికవర్గం నేతలు కావడంతో సమస్యను స్మూత్ గా డీల్ చేయాలని హైకమాండ్ భావించింది. అందుకే ఇద్దరినీ తాడేపల్లికి పిలిపించి మరీ క్లాస్ పీకింది.త్వరలో రాజమండ్రి కార్పొరేషన్ కు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం వైసీపీకి అవసరం. తూర్పు గోదావరి జిల్లాలో జనసేన బలం క్రమంగా పెరుగుతుంది. టీడీపీలో నెలకొన్న విభేదాలు వైసీపీని ఆనందపర్చే లోగా నేతల మధ్య నెలకొన్న విభేదాలు పార్టీ నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టాయి. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డిల మధ్య నెలకొన్న విభేదాలు తమకు అనుకూలంగా మారతాయని భావించిన తరుణంలో మార్గాని, జక్కంపూడిల మధ్య వార్ ఇరుకున పెట్టింది.అందుకే ఇద్దరికీ జగన్ హెచ్చరించినట్లు తెలిసింది. పార్టీని ఇబ్బంది పెట్టే కార్యక్రమాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని జగన్ హెచ్చరించారని చెబుతున్నారు. ఇద్దరూ కలసి కట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని ఆదేశించారు. భవిష్యత్ లో ఎలాంటి వ్యాఖ్యలు తాను వినకూడదని జగన్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఇద్దరు చెప్పిన వివరణలను సానుకూలంగా విన్న జగన్ ఇద్దరికి చేతులు కలిపి పంపించేశారని పార్టీ వర్గాలు చెప్పాయి.

# రంగంలోకి కాపు సంక్షేమ సేన

విజయవాడ, సెప్టెంబర్ 29, (న్యూస్ పల్స్)ప్రముఖ సినీనటుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై వైసీపీ నేతల విమర్శలపై కాపు సంక్షేమ సేన స్పందించింది. దీనికి సంబంధించి ఒక లేఖ విడుదల చేసింది. కాపు మంత్రులు పవన్‌ను తిట్టడం వెనక ఏపీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి హస్తం ఉందని ఆరోపించింది. పవన్‌ను అవమానించడం అంటే.. కాపు సమాజాన్ని అవమానపరచడమేనని పేర్కొంది. 2024 ఎన్నికల్లో వీటి పర్యవసానాన్ని సీఎం జగన్ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి హరిరామజోగయ్య సదరు లేఖలో పేర్కొన్నారు.కాగా, 'రిపబ్లిక్' సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ఊపు ఊపేస్తున్నాయి. ఆ రోజు మొదలు ఇప్పటి వరకు జనసేన, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం భీకరంగా సాగుతోన్న సంగతి తెలిసిందే. మంత్రులందరూ మూకుమ్మడిగా పవన్ కళ్యాణ్‌పై విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమ, టికెట్ల పంపిణీ వంటి అంశాల్లో ఏపీ ప్రభుత్వంపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను మంత్రుల తీవ్రంగా ఖండించారు. పవన్ విధానాలను తూర్పారబట్టారు. మంత్రులంతా సన్నాసులు అంటూ పవన్ చేసిన తీవ్ర వ్యాఖ్యలకు.. మంత్రులు సైతం అంతే ఘాటుగా రిప్లై ఇస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ఆయన దోపిడీకి అడ్డంకిగా మారుతున్నాయి కాబట్టే అంతలా రియాక్ట్ అవుతున్నారంటూ ఫైర్ అయ్యారు.అయితే, వైసీపీ నేతలు చేస్తున్న మూకుమ్మడి కామెంట్స్‌పై తాజాగా పవన్ కళ్యాణ్ స్పందించారు. ట్విట్టర్ వేదికగా వైసీపీ ప్రభుత్వంతోపై మరోసారి విరుచుకుపడ్డారు. వైసీపీ ప్రభుత్వ పాలసీ 'ఉగ్రవాదం' అంటూ మండిపడ్డారు. ఈ విధానలతో రాష్ట్రంలోని అన్ని రంగా?ల, వర్గాలు నాశనం అయిపోయాయని ఫైర్ అయ్యారు. ఈ ఉగ్రవాద పాలసీని ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ మేరకు పవన్ ట్వీట్ చేశారు.ఇక, పవన్ వ్యాఖ్యలపై సినీనటుడు పోసాని కృష్ణ మురళి కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పవన్ ఫ్యాన్స్ తనని టార్గెట్ చేసి అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నారని పోసాని ప్రెస్ మీట్ పెట్టి మరీ మరోసారి పవన్ కళ్యాణ్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# "జగనన్న గోరుముద్ద" రుచికరంగా ఉంది

**జేసీ (అభివృద్ధి) సాయికాంత్ వర్మ**

**గాలివీడు మండలం పెద్దూరు ఎంపిపి ఉర్దూ పాఠశాలను**

**ఆకస్మిక తనిఖీ చేసిన జేసీ**

**విద్యార్థులతో కలిసి "జగనన్న గోరుముద్ద" భోజనాన్ని తిని**

**సంతృప్తి వ్యక్తం**

కడప, సెప్టెంబర్ 29 జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం.. రుచికరమైన "జగనన్న గోరుముద్ద" పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ సంబందిత అధికారులను ఆదేశించారు. బుధవారం గాలివీడు మండలం లోని పెద్దూరు ఎంపిపి ఉర్దూ ప్రాథమిక పాఠశాలను, అదేవిధంగా సమీపంలో ఉన్న హై స్కూల్ ను జేసీ సాయికాంత్ వర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా.. జగనన్న గోరుముద్ద పథకం ఎంత మేర నాణ్యతతో అమలవుతుందోనని పరిశీలించారు. భోజనం రుచిగా ఉంటుందా ? కడుపునిండా పెడుతున్నారా.. ? అని విద్యార్థులను అడుగుతూ.. వారితో కలిసి జేసీ మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు అందించే భోజనం నాణ్యతగా, రుచికరంగా ఉండటంతో.. జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా.. ఇలాగే.. మెనూ ప్రకారం "జగనన్న గోరుముద్ద" పథకాన్ని అమలు చేయాలని సంబందిత అధికారులను ఆయన ఆదేశించారు.అంతకు ముందు.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరైన విద్యార్థుల సంఖ్యను ... అలాగే ఉపాధ్యాయుల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్తులందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులతో అన్నారు.

# పాలిటెక్నిక్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

విజయవాడ సెప్టెంబర్ 29 పాలిటెక్నిక్ ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఇప్పటికే పలు ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ తాజాగా పాలిసెట్ 2021 నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ సందర్భంగా టెక్నికల్ ఎడ్యకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ.. ఉపాధి అవకాశాలున్న కోర్సులపై ప్రత్యేక దృష్టి సాధించాం. విద్యార్థులకి స్కిల్‌డెవలప్‌మెంట్ కోసం కొన్ని ప్రముఖ సంస్థలతో ఎంఓయూ చేసుకుంటున్నాం. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివే విద్యార్థులకి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

# రాజు గారి సర్వేపై చర్చోప చర్చలు

ఏలూరు, సెప్టంబర్ 29, '(న్యూస్ పల్స్)సీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణరాజు జగన్ ను బద్నాం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లుంది. ఇప్పటి వరకూ జగన్ ను, ప్రభుత్వంపైనా విమర్శలు చేసే ఆయన కొత్త ఎత్తుగడను ఎంచుకున్నట్లు కనపడుతుంది. జగన్ గ్రాఫ్ పడిపోయిందంటూ ఇటీవల కొత్త ప్రచారాన్ని మొదలు పెట్టారు. తాను సర్వేలు చేయిస్తున్నానని ఇందులో జగన్ గ్రాఫ్ 15 శాతం పడిపోయిందని రఘురామ కృష్ణరాజు చెబుతున్నారు.గతంలో కూడా రఘురామ కృష్ణరాజు సర్వే చేయించినట్లు చెప్పారు. తన పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సర్వే చేయిస్తే ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు తప్ప వచ్చే ఎన్నికల్లో ఎవరూ గెలవరని తన సర్వేలో తేలినట్లు ఆయన చెప్పారు. ఇప్పుడు కొత్తగా జగన్ గ్రాఫ్ పైన ఆయన రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేయించినట్లు చెబుతున్నారు. ఎవరు సర్వే చేశారో? దానికి ప్రాతిపదిక ఏంటో మాత్రం రఘురామ కృష్ణరాజు చెప్పడం లేదు.దీన్ని బట్టి సర్వే పేరుతో జగన్ పార్టీకి నష్టం చేయాలని మాత్రం రఘురామ కృష్ణరాజు చూస్తున్నట్లుంది. ఒక సర్వే రాష్ట్ర వ్యాప్తంగా చేయాలంటే అందుకు సంస్థలు నెలల కొద్దీ సమయం తీసుకుంటాయి.

# బాలబాలికల కు విద్య కరువు ఉపేంద్ర

ఎం ఈ ఈ పై చర్యలేవి ఏ ఐ ఎస్ ఎఫ్ డిమాండ్?
ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కౌతాళం మండలంలోని బొగిగ్రాప్ వద్ద ఎంపీపీ స్కూల్ లో ఈ రోజు మధ్యాహ్నం భోజన పథకం సర్వే చేయడం జరిగింది



కౌతాళం సెప్టెంబర్ 29, ( విభారె) ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎస్ ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర మాట్లాడుతూ ఎమ్ పి పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సర్వే చేయగా పాఠశాలలో ఉన్నా విద్యార్థుల సంఖ్య 360 అయితే ఉపాధ్యాయుల సంఖ్య 4 నలుగురు అక్కడ ఉన్న ఆ నలుగురు ఉపాధ్యాయులను కుడా కౌతాళం మండలం ఎం ఈ ఓ సునంద కు డిప్యూటేషన్ కింద కాత్రికీ గ్రామం కు పంపిస్తున్నారు. ఇలా చేస్తే ఇక్కడ ఉన్న విద్యార్థులకు బోధన ఎవరు చేయాలి.. ఏఐఎస్ఎఫ్ కౌతాళం మండలం సమితి ద్వారా గట్టిగా ప్రశ్నించారు. వారు మాట్లాడుతూ గతంలో కూడా ఎంఈఓ ఉప్పరహాళ్ గ్రామం పాఠశాలలో అవినీతికి పాల్పడితే దాని పై విచారణ చేపట్టారు కానీ దాని గురించి ఇంతవరకు ఎలాంటి స్పందన లేదు అంటూ ఇప్పటికీ అయిన కౌతాళం మండలం ఎం ఈ ఓ సునంద పై అధికారులు కఠిన చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం అని హెచ్చరించరు..ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల సమితి నాయకులు గురు,మహేష్ పాల్గొన్నారు.

## కస్తూరిబా లో ఉన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి

### ఎస్ ఎఫ్ ఐ

నందవరం సెప్టెంబర్ 29, ( విభారె) నందవరంలో ఉన్నటువంటి కస్తూరిబా బాలికల విద్యాలయంలో 206 విద్యార్థినిలు విద్యనభ్యసిస్తున్నారు కానీ నీళ్లు లేక విద్యార్థినిలు చాలా అవస్థలు పడుతున్నారని ఈ నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీవో ఫజల్ భాష గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.



ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడునేడు లో భాగంగా కస్తూరిభాకి 27 లక్షలు పైగా నిధులు కేటాయించినప్పటికీ ఈ నీటి సమస్యలను పరిష్కరించకపోవడం చాలా దారుణమని అలాగే అధికారులు కూడా పట్టీ పట్టినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ఆ నీటి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు లేనిపక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) గా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# పంట నమోదు తప్పనిసరి... ఏ.ఓ పవన్ కుమార్



తుగ్గలి సెప్టెంబర్ 29, (( విభారె) .: రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పకుండా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ తెలియజేశారు.బుధవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం నందు మండల స్థాయిలో గ్రామ వ్యవసాయ సలహా మండలి శిక్షణ కార్యక్రమం ను వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధ్యక్ష వహించిన ఏ.వో పవన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మరియు పరిశ్రమల శాఖ మరియు ఉద్యానవన శాఖలకు సంబంధించిన వివిధ రకాల పథకాల గురించి మరియు వివిధ పంటలు యాజమాన్యం గురించి వివరించారు. అదేవిధంగా రైతులు పంట నమోదు తప్పకుండా చేయించుకోవాలని,చేయించుకోని ఎడల పంట నష్టపరిహారం,క్రాప్ ఇన్సూరెన్స్, పంట కొనుగోలు వంటి పథకాలు వర్తించవని తెలియజేసారు. కనుక రైతులు పంట నమోదు తప్పక చేయించుకోవాలని తెలియజేసారు. అనంతరం హార్టికల్చర్ ఆఫీసర్ అనూష మాట్లాడుతూ ఉద్యానవన పంటల గురించి రైతులకు వివరించారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధుల గురించి,నివారణ గురించి గ్రూప్ సభ్యులకు వివరించారు. మూగ జీవాలకు టీకాలు వేయించుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమానికి హార్టికల్చర్ ఆఫీసర్ అనూష, వెటర్నరీ డాక్టర్ ప్రణీత,లక్ష్మన్, ఏఈవో రంగన్న, లక్ష్మీ చైతన్య,గ్రామ సహాయకులు రవి,తిమ్మప్ప, మహేష్,తులసి ఎంపీ ఈవో లు అజారుద్దీన్, రంగయ్య,సోమేశ్వరి,లక్ష్మి,స్రవంతి,చైతన్య, గ్రామ వ్యవసాయ సలహా మండలి సభ్యులు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు దేశం పార్టీ కి యువతే వెన్నెముక

### పాలకుర్తి తిక్కరెడ్డి గారు



కౌతాళం సెప్టెంబర్ 29, (( విభారె) రాబోయే రోజుల్లో తెలుగు దేశం పార్టీ అధికారం లోకి రావడానికి యువత ముందు అడుగు వేయాలని మంత్రాలయం నియోజకవర్గం ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి గారు అన్నారు వారు మంత్రాలయం నియోజకవర్గం లోని కౌతాళం మండలం లోని గోతులదోడ్డి గ్రామనికి చెందిన చూడి శివమూర్తి కి తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి గా నియమించడం తో టి యన్ యస్ ఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు అధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గం ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి గారిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి గారుని తెలుగు యువత జిల్లా ప్రదాన కార్యదర్శి ×పాలకుర్తి దివాకర్ రెడ్డి గారు ని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పాలకుర్తి తిక్కరెడ్డి గారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో యువత మొత్తం తెలుగు దేశం పార్టీ అధికారం లోకి తేవడానికి కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు మన నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో అనేక పదువులు ఇచ్చినందుకు తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారు కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు టి యన్ యస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నియమితులైన చూడి శివ మూర్తి మాట్లాడుతూ నాకు రాష్ట్ర స్థాయి లో పదవి ఇచ్చినందుకు మంత్రాలయం నియోజకవర్గం ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి గారికి కచ్చితంగా రుణ పడి వుంటానాని మంత్రాలయం నియోజకవర్గం లో తెలుగు దేశం పార్టీ గెలుపు కోసం పని చేసాను అని రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి గారికి తెలుగు యువత జిల్లా ప్రదాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోతులదోడ్డి సర్పంచ్ లక్ష్మీ గోవింద్ తిప్పలదోడ్డి సర్పంచ్ మల్లయ్య మైనారిటీ జిల్లా కార్యదర్శి రహ్మాన్ యస్ సి సెల్ జిల్లా కార్యదర్శి సల్మాన్ రాజు తెలుగు యువత పులి గోట్టయ్య ఏరిగేరి శ్రీరాములు రామంజి ,నాగరాజు, మౌనేష్ రీషి నరసింగప్ప లక్ష్మయ్య రఘు దుర్గ ప్రసాద్, హనుమేష్ ,సునిల్ తిప్పలదోడ్డి ఈరన్న ,తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్ల ఖాళీ పోస్టులు..భర్తీ

### ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో పార్థసారథి..

పత్తికొండ సెప్టెంబర్ 29, (( విభారె): స్థానిక పత్తికొండ మండలం లో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు వాలంటీర్ల ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. మండల ప్రజా పరిషత్ అధికారి (ఎంపీడీవో) పార్థసారథి మాట్లాడుతూ మొత్తం ఖాళీ పోస్టులు 10 కి గాను అందులో 5 గ్రామాల నుంచి 20 మంది నిరుద్యోగులు రాగా అందులో 10 మందిని వాలంటీర్లుగా ఎంపిక చేయడం జరిగింది. మండల పరిధిలోని గ్రామాలు నలకదొడ్డి, హోసూరు, పెద్దహుల్తి, మండగిరి, పందికోన గ్రామాలు నుంచి నాలకదొడ్డి - 2, హోసూరు - 1, పెద్దహుల్తి - 4, మండగిరి - 1, పందికోన -2 పోస్టులను భర్తీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు సుధాకర్, రామకృష్ణ పవన్ పాల్గొన్నారు.

# చేనేత హస్తకళ మేళా ప్రదర్శన ను సద్వినియోగం చేసుకోవాలి



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 29, (( విభారె) ఎమ్మిగనూరు పట్టణంలో మాచాని సోమప్ప కళ్యాణ మండపంలో గ్రామీణ వివర్స్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా చేనేత హస్తకళల ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ నిర్వాహకులు కోరారు. సోమవారం స్థానిక సోమప్ప మెమోరియల్ హాల్ లో చేనేత హస్త కళల ప్రదర్శన ప్రారంభించారు. చేనేత వస్త్రములు పోచంపల్లి మంగళగిరి చీరాల శారీస్ డ్రెస్ మెటీరియల్స్ కలంకారి చీరలు లుంగీలు ఖాది వస్త్రములు హస్త కళ వస్తువులు కొండపల్లి ఏటికొప్పాక చెక్క బొమ్మలు హైదరాబాద్ మంచి ముత్యములు బ్యాగులు మొదలైన వస్తువులు కళాకారులచే నేరుగా అమ్మకమునకు ఉంది. అన్ని వస్తువులు చౌక ధరలకే లభించే వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు,

## నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతుంది

### ఆవాజ్ కమిటీ

నంద్యాల సెప్టెంబర్ 29, (( విభారె):- నంద్యాల మున్సిపల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్ లు వారి వారి వార్డు ల లో ప్రజల సమస్యలను కౌన్సిల్ సమావేశంలో తెలియజేసి ప్రజల పక్షాన చర్చించి నిధులను సాధించివార్డు లో అభివృద్ధి పనులు చేయాలని ఆవాజ్ జిల్లా కన్వీనర్ యస్ . మస్తాన్ వలి. ఇన్సాఫ్ కమిటీ డివిజన్ నాయకులూ. షరీఫ్ భాష పిడిఎస్యు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ ఎండి రఫీ వార్డ్ కౌన్సిల్ ను డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల లో 42 వార్డుల్లో. ప్రజలు దోమలతో డెంగ్యు జ్వరాలతో బాధపడుతుంటే ప్రజల బాధలు పట్టించుకోకపోగా. అభివృద్ధి పనులకు ఏమాత్రం ప్రారంభం కావడం లేదు అధికార పార్టీ పుణ్యమా అని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నది గతంలో అభివృద్ధి పనుల కైశిలాఫలకాలు వేసిన చైర్మన్ గారు లేకపోయినా నంద్యాల ఎమ్మెల్యే గారు ఉన్నారు కనీస సదుపాయాలు కల్పించడం లేదని ప్రజలు అంటున్నారు అయినా అధికారులు అధికార పార్టీ కౌన్సిలరులు కౌన్సిల్ సమావేశం ముగించుకుని వెళుతున్నారు ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్ల గాని ఇండిపెండెంట్ కౌన్సిలర్ గాని తమ వార్డులోని సమస్యలు. తెలియ చేస్తామన్నా అధికార పార్టీ చైర్మన్ గారు వినిపించుకోకుండా వెళ్లిపోవడం ఆ ప్రజాస్వామ్య పద్ధతి కి నిదర్శనమని భారత దేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉందని ప్రధాని మోడీ అమెరికాలో చెప్పారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగారు మీ స్థాయిలోఅన్ని సమావేశాలు చర్చించాలని చెప్పారు

# సమంత అంటే నాకు ఇష్టం .. ఆమెనే నా రోల్ మోడల్



ఐశ్వర్య రాజేశ్ .. చాలాకాలం క్రితం వచ్చిన రాజేంద్రప్రసాద్ 'రాంబంటు' సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపించింది. ఆ తరువాత తమిళ సినిమాలనే ఎక్కువగా చేస్తూ వెళ్లింది. కథానాయికగా తమిళంలో మంచి క్రేజ్ తెచ్చుకుంది. అక్కడి కుర్ర హీరోలతో కలిసి నటిస్తూ యూత్ నుంచి మంచి మార్కులు కొట్టేసింది. సినిమా వాతావరణంలో పుట్టి పెరగడం వలన ఐశ్వర్య రాజేశ్ కి నటన కొట్టిన పిండి. అందువలన ఎంతటి బరువైన పాత్రనైనా ఆమె చాలా తేలికగా చేసేయగలదు. 'కౌసల్య కృష్ణమూర్తి' సినిమాతో ఆమె మళ్లీ తెలుగు తెరకి వచ్చింది. ఫీమేల్ లీడ్ రోల్ తో నడిచే ఈ సినిమాతో నటన పరంగా ఆకట్టుకుంది. ఆ తరువాత ఒకటి రెండు తెలుగు సినిమాలు చేసినప్పటికీ 'వరల్డ్ ఫేమస్ లవర్' సినిమాలోని 'సువర్ణ' పాత్ర ఆమెకి మంచి గుర్తింపు లభించింది. ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు ఉంటారు. కానీ ఐశ్వర్య రాజేశ్ తో నడిచే ట్రాక్ మాత్రమే ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ఇటీవల 'టక్ జగదీష్' సినిమాలో ఆమె నానీ మేనకోడలిగా మెప్పించింది. తన పాత్ర నిడివి తక్కువే అయినా ఎమోషన్స్ ను చాలా చక్కగా పలికించింది. అలాంటి ఐశ్వర్య రాజేశ్ తాజా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి 'రిపబ్లిక్' సినిమా రెడీ అవుతోంది. అక్టోబర్ 1వ తేదీన ఈ సినిమాను భారీస్థాయిలో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ లో ఐశ్వర్య రాజేశ్ బిజీగా ఉంది. తాజా ఇంటర్వ్యూలో "మీ రోల్ మోడల్ ఎవరు?" అనే ప్రశ్న ఆమెకి ఎదురైంది. అందుకు ఆమె స్పందిస్తూ .. " అంతకుముందు నేను సౌందర్యగారి అభిమానిని. ఎలాంటి పాత్రలోనైనా ఆమె అందంగా ఇమిడిపోయే తీరు నాకు ఎంతగానో నచ్చేది. అప్పట్లో ఆమె సినిమాలు తప్పకుండా చూసేదానిని. ఎంత సింపుల్ గా ఉండే పాత్రలోనైనా అంత అందంగా కనిపించే వారిని నేను చూడలేదు. ఇక ఇప్పటి హీరోయిన్స్ లో నాకు సమంత గారు అంటే చాలా ఇష్టం .. ఆమెనే నా రోల్ మోడల్. అందంగా .. అమాయకంగా కనిపిస్తూ అద్భుతంగా నటించడం సమంతగారి ప్రత్యేకత. ఎలాంటి బరువైన పాత్రలోనైనా ఆమె మెప్పించగలదు. సరదాగా ఉండే పాత్రలలో ఆమె ఎంత గొప్పగా నటిస్తారో .. ఎమోషన్స్ తో కూడిన పాత్రల్లోను అంతే గొప్పగా ఆకట్టుకుంటారు. కెరియర్ పరంగా ఆమె ఎదుగుతూ వచ్చిన తీరు నాకు ఆదర్శం" అంటూ చెప్పుకొచ్చింది. ఇక 'రిపబ్లిక్' సినిమాలో నేను ఎన్నారైగా 'మైరా' పాత్రలో కనిపిస్తాను. సరదాగా ఆడిపాడే పాత్ర కాదు ఇది .. చాలా పరిపక్వతతో నడుస్తుంది. ఈ పాత్ర నాకు మంచి పేరు తెస్తుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం తమిళంలో నాయిక ప్రధానమైన సినిమాలతో బిజీగా ఉన్నాను" అంటూ చెప్పుకొచ్చింది

# హిట్ కొట్టేసిన 'లవ్ స్టోరీ' .. మరోసారి సెట్ అయిన కాంబినేషన్!



తెలుగు తెరపై ప్రేమకథలకు ఆదరణ ఎప్పుడూ ఉంటుంది. విభిన్నమైన కథాకథనాలు .. మనసుకు హత్తుకు పోయే మాటలు .. హృదయపు లోతులు తాకే పాటలు ఉంటే ఇక ఆ సినిమాకి ప్రేక్షకులు పట్టం కట్టేస్తారు. వీలైనంతవరకూ విజయాన్ని తీసుకొచ్చి దోసిట్లో పెట్టేస్తారు. ప్రస్తుతం అలాంటి ఆదరాభిమానాలను దక్కించుకుంటున్న సినిమాగా 'లవ్ స్టోరీ' సినిమా కనిపిస్తోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 24వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలిరోజునే సక్సెస్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా ఆ తరువాత కూడా అదే జోరును కొనసాగిస్తోంది. ప్రేమకథలపై శేఖర్ కమ్ములకు మంచి పట్టుంది. ప్రేమకథలతో ఫ్యామిలీ ఆడియన్స్ ను ఎలా థియేటర్లకు రప్పించాలో కూడా ఆయనకి బాగా తెలుసు. నిజానికి ఎవరైనా సరే యూత్ ను దృష్టిలో పెట్టుకునే లవ్ స్టోరీస్ తీస్తారు .. ఎందుకంటే యూత్ కోరుకునేవి .. ఫ్యామిలీ ఆడియన్స్ ఆశించేవి ఒకే తెరపై ఇమడవు. కానీ ఒకే కథతో అటు యూత్ ను .. ఇటు ఫ్యామిలీ ఆడియన్స్ ను ఒప్పించడం ఒక్క శేఖర్ కమ్ములకు మాత్రమే సాధ్యమైంది. ఇక కథను స్థానికంగా నడిపిస్తూ .. అక్కడి యాసలో పాత్రల చేత మాట్లాడిస్తూ మాస్ ఆడియన్స్ కూడా ఇది మనకథ అనుకునేలా చేయడం ఆయన ప్రత్యేకత. ఇలాంటి లక్షణాలతో .. అంశాలతో తెరకెక్కిన 'లవ్ స్టోరీ'కి ప్రేక్షకులు నీరాజనాలు పడుతున్నారు. భారీ వసూళ్లను థియేటర్లకు బహుమానంగా అప్పగిస్తున్నారు. దాంతో ఈ సినిమా టీమ్ అంతా కూడా ఫుల్ ఖుషీగా ఉంది. అంతేకాదు ఇదే కాంబినేషన్లో మరో సినిమాను చేయాలనే నిర్ణయానికి కూడా వచ్చేశారు. చైతూ .. సాయిపల్లవి జంటగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో మరో సినిమాను చేయనున్నామని నిర్మాతలు నారాయణ దాస్ నారంగ్ - రామ్మోహన్ రావు చెప్పారు. వచ్చే ఏడాదిలో ద్వితీయార్థంలో ఈ సినిమా సెట్స్ పైకి వెళుతుందనే విషయాన్ని స్పష్టం చేశారు. ప్రస్తుతం చైతూ .. విక్రమ్ కుమార్ దర్శకత్వంలో 'థ్యాంక్యూ' సినిమా చేస్తున్నాడు. రాశి ఖన్నా కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికే చాలావరకూ చిత్రీకరణను జరుపుకుంది. ఇక ఇటీవలే 'బంగార్రాజు' సినిమా కూడా సెట్స్ పైకి వెళ్లింది. ఈ సినిమాలో ఒక కథానాయకుడిగా నాగార్జున కనిపించనుండగా మరో కథానాయకుడిగా చైతూ కనిపించనున్నాడు. గ్రామీణ నేపథ్యంలో రూపొందే ఈ సినిమాలో రొమాన్స్ పాళ్లు ఎక్కువగానే ఉండనున్నాయని అంటున్నారు. ఈ సినిమాలో ఆయన జోడీగా కృతి శెట్టి అలరించనుంది. ఈ రెండు సినిమాలను చైతూ పూర్తి చేయవలసి ఉంది. అలాగే అమెజాన్ ప్రైమ్ వారి వెబ్ సిరీస్ ను కూడా పూర్తి చేయవలసి ఉంది. ఈ ప్రాజెక్టులన్నీ వచ్చే సమ్మర్ కి పూర్తవుతాయి. ఇక ఈ లోగా శేఖర్ కమ్ముల కూడా ధనుశ్ సినిమాను మొదలుపెట్టేసి .. పూర్తి చేయవలసి ఉంది. ధనుశ్ కథానాయకుడిగా ఆయన ఒక సినిమాను చేయనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను కూడా నారాయణ దాస్ నారంగ్ - రామ్మోహన్ రావు నిర్మించనున్నారు. ఇప్పటికే ఈ సినిమాకి సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. అంటే 'లవ్ స్టోరీ'తో కలుపుకుని దర్శక నిర్మాతలు మూడు ప్రాజెక్టులను లైన్లో పెట్టేసినట్టుగా తెలుస్తోంది. ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళ .. హిందీ భాషల్లోనూ విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఆ దిశగానే సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇక సాయిపల్లవి విషయానికి వస్తే ఆమె నుంచి 'విరాటపర్వం' .. 'శ్యామ్ సింగరాయ్' సినిమాలు రానున్నాయి. ఈ రెండు సినిమాల్లోను ఆమె చేసిన పాత్రలు విభిన్నమైనవి .. విశిష్టమైనవి కావడం విశేషం. ఒక మలయాళం సినిమాకి సైన్ చేశాననీ రెండు తెలుగు .. రెండు తమిళ కథలు చర్చల దశలో ఉన్నాయని రీ సెంట్ గా ఇచ్చిన ఇంటర్వ్యూలలో చెప్పింది. ఆ ప్రాజెక్టుల విషయం చూసుకుని ఆమె వచ్చే వేసవికి రెడీ అవుతుందన్న మాట.

# బక్క చిక్కి ఝుడిపిస్తున్న ఆపిల్ బ్యూటీ

హన్సిక ట్రాన్స్ ఫర్మేషన్ ఇప్పుడు అభిమానులకు షాక్ నిస్తోంది. కెరీర్ ఆరంభంలో బబ్లీ లుక్ లో ఆకట్టుకుని ఆపిల్ బ్యూటీగా పాపులరైన ఈ అమ్మడు ఇటీవల రకరకాలుగా మేకోవర్ ట్రై చేస్తోంది. తన బబ్లీ లుక్ ఆరంభం కోలీవుడ్ లోనే ఎక్కువ అవకాశాలకు కారణమైంది. అమ్మడు అక్కడ స్థిరపడటానికి లుక్ ఎంతగానో



ఉపయోగపడింది. మరీ అంత లావుగా లేకపోయినా పర్ ఫెక్ట్ సైజ్ తోనే అక్కడ లాంచ్ అవ్వడం..అటుపై టాలీవుడ్ లోనూ కలిసొచ్చింది. అలా కశ్మీర్ ఆపిల్ బ్యూటీగా పేరుగాంచింది. అయితే కాలక్రమేణా హన్సిక శరీరంలో ఊహించని మార్పులు భారీగానే చోటు చేసుకున్నాయి. ఒక్కసారిగా మరింతగా ఒళ్లు చేసి ఓవర్ బబ్లీలుక్ లో కనిపించింది. అయినా తమిళ తంబీలు ఆ లుక్ లో సైతం ఆదరించారు. కానీ తెలుగులో అవకాశాలు తగ్గాయి.సహజంగా బబ్లీ గాళ్స్ కి ఇక్కడ అంత క్రేజ్ ఉండదు. ఆ రకంగా హన్సిక కొన్ని అవకాశాల్ని కోల్పోయింది. అయితే ఇప్పుడు హీరోలంతా పాన్ ఇండియా కంటెంట్ లపై దృష్టి పెట్టడంతో! హన్సిక కూడా ఆ రకంగా తనమైండ్ సెట్ ని మార్చినట్లు కొన్ని సన్నివేశాలు చెప్పకనే చెబుతున్నాయి. తాజాగా హన్సిక బక్క చిక్కిన లుక్ ఒకటి ఇన్ స్టాలో వైరల్ గా మారింది. సైజ్ జీరో లుక్ లో తన కొత్త యాంగిల్ ని పరిచయం చేసింది. పైన బ్లౌజు..బాటమ్ లో ధరించిన ప్యాంట్ సైతం పర్ ఫెక్ట్ గా స్కిన్ కి ఫిట్ కాలేదు. ఇక శరీరంలో..ముఖంలో మార్పులు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమ్మడు పూర్తిగా జీరో కోలెస్టిరాల్ బాడీతో కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. ఆపిల్ బ్యూటీని ఇలా చూసి పోల్చుకోవడం కూడా కష్టంగా మారింది. అన్నట్టు ఆపిల్ బ్యూటీని కొన్ని తమిళ చిత్రాల్లో దెయ్యం పాత్రలో చూపించారు. రాజ్ మహల్ .. కళావతి అంటూ హారర్ థ్రిల్లర్లలో భయపెట్టింది. కళావతి తెలుగులో విడుదలై ఆకట్టుకుంది. ఇప్పుడు అందుకు తగ్గట్టే మారిందంటూ పంచ్ లు పడుతున్నాయి నెటిజనుల్లో!ప్రస్తుతం హన్సిక కోలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంది. అలాగే తెలుగులోనూ రెండు చిత్రాల్లో నటిస్తోంది. 'మై నేమ్ ఈజ్ శ్రుతి'.. '105 మినిట్స్' చిత్రాల్లో నటిస్తోంది. అయితే ఈ రెండు ప్రాజెక్ట్ లు డిలే అవుతున్నాయి. సెట్స్ కు వెళ్లి కొన్ని నెలలు గడుస్తున్నాయి. మధ్యలో కరోనా అడ్డు రావడంతో షూటింగ్ బ్రేక్ పడింది. మళ్లీ తిరిగి షూటింగ్ ప్రారంభమైనట్లు ఎలాంటి అప్ డేట్ కూడా బయటకు రాలేదు.

# రానున్న రెండు వరల్డ్‌కప్‌లకు అతడే కెప్టెన్‌గా ఉండాలి!

వరుస ఐసీసీ ఈవెంట్ల నేపథ్యంలో టీమిండియా కెప్టెన్లనూ తరచూ మార్చడం సరికాదని లిటిల్ మాస్టర్ సునీల్ గావస్కర్ అన్నాడు. అక్టోబరులో ప్రారంభం కానున్న టీ20 వరల్డ్‌కప్ నుంచే భారత జట్టు సారథ్య బాధ్యతలు రోహిత్ శర్మకు అప్పగిస్తే బాగుంటుందని సూచించాడు. తద్వారా వచ్చే ఏడాది జరుగనున్న పొట్టి ఫార్మాట్ ప్రపంచకప్‌లో మెరుగైన ఫలితాలు సాధించే వీలుంటుందని పేర్కొన్నాడు. కాగా యూఏఈ, ఒమన్ వేదికగా జరుగనున్న టీ20 వరల్డ్‌కప్-2021 ముగిసిన తర్వాత తాను ఈ ఫార్మాట్ కెప్టెన్సీ నుంచి తప్పుకొంటానని టీమిండియా సారథి విరాట్ కోహ్లి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తదుపరి కెప్టెన్‌గా రోహిత్ శర్మ పేరు వినిపిస్తోంది. అయితే, కొంతమంది దిగ్గజాలు మాత్రం వయసు రీత్యా రోహిత్‌ను పక్కనపెట్టి కేఎల్ రాహుల్ లేదంటే రిషభ్ పంత్‌కు అవకాశమిస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. సునీల్ గావస్కర్ సైతం తొలుత తన ఓటు కేఎల్ రాహుల్‌కే అన్నాడు. కానీ, తాజాగా ఓ షోలో మాట్లాడుతూ... రోహిత్ రెండు మెగా ఈవెంట్లకు కెప్టెన్‌గా ఉండాలంటూ మాట మార్చాడు. ఈ మేరకు.. "వచ్చే రెండు వరల్డ్‌కప్‌లకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉంటే మంచిది. ఒకటి వచ్చే నెలలో ఆరంభం కానుంది. మరొకటి... వచ్చే ఏడాది. కాబట్టి.. కెప్టెన్లను మారుస్తూ ఉంటే ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. రెండు ప్రపంచకప్‌లకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉండాలన్నదే నా నిశ్చిత అభిప్రాయం" అని సునీల్ గావస్కర్ చెప్పుకొచ్చాడు. కోహ్లి స్థానంలో ఇప్పుడే హిట్‌మ్యాన్ సారథ్య బాధ్యతలు చేపడితే బాగుంటుందని పేర్కొన్నాడు. కాగా ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మకు మంచి రికార్డు ఉన్న సంగతి తెలిసిందే. అతడి నేతృత్వంలో ముంబై ఇప్పటి వరకు ఐదు టైటిళ్లు గెలిచింది. మరోవైపు.. కోహ్లి కెప్టెన్‌గా ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇంతవరకు ఒక్కసారి కూడా కప్ గెలవలేదు. ఇదిలా ఉండగా.. వచ్చే ఏడాది ఆస్ట్రేలియా వేదికగా టీ20 ప్రపంచకప్ జరుగనున్న సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**